# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

06.01.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 183 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







## మహిళా సాధికారితకు
# పెద్దపీట



- ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా
- ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్చాలన్నదే లక్ష్యం
- ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం

మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

మిగతా 2 లో



## తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు
# సరికాదు


## ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలి

### ఎన్టీఆర్ వచ్చాకనే ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు రాక

- కాళేశ్వరం కట్టినా తాము అడ్డుచెప్పలేదు
- వృథా జలాలను ఉపయోగిస్తేనే మేలు
- కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు నేనే పూర్తి చేశా
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**గుంటూరు :** తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలని వ్యాఖ్యానించారు. దీనికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలంటే... మనలో ఐకమత్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఉన్నా... తెలుగే మాతృభాష అని తెలిపారు. రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాకే... సాగర్ జలాలను ఉపయోగించుకునేలా

మిగతా 5 లో



### ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి

విశాఖపట్నం రిఫైనరీ అందుబాటులోకి కొత్త రెసిడ్యూ అప్‌గ్రేడేషన్

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పరి ట్వీట్‌కు సీఎం చంద్రబాబు రీ ట్వీట్

### మారిషస్ అధ్యక్షుడితో సీఎం చంద్రబాబు మర్యాద పూర్వక భేటీ...

వివరాలు 5లో

## రాష్ట్రంలో విస్తృతంగా
# సోలార్ పవర్



- వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం
- పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే
- మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి


2

## వ్యక్తిగా వెళుతున్నా..
# శక్తిగా తిరిగి వస్తా

- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే.. కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో కవిత భావోద్వేగం

3





### అమెరికాలో హైదరాబాద్
# యువతి హత్య

చెన్నైలో ఆమె మాజీ ప్రియుడు అర్జున్ అరెస్ట్

2

## సభను తప్పదోవ పట్టించిన సీఎం

స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

2

## ఓఎన్జీసీ పైపులైన్‌లో
# గ్యాస్ లీక్

భారీగా ఎగిసిపడ్డ మంటలు

అప్రమత్తం అయిన అధికారులు



**అంబేడ్కర్ కోనసీమ :** మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ పైపులైన్ నుంచి గ్యాస్ లీకై భారీగా మంటలు ఎగసిపడ్డాయి. గ్యాస్ గాలిలోకి ఎగజిమ్మడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అది చూసి గ్రామస్థులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో మండల తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీక్ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న


మిగతా 3 లో

### గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం

3

## వరద జలాల పేరుతో
# అసలుకు ఎసరు



- 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నం
- సుప్రీంలో తెలంగాణ వాదనలు

2

# హరీష్ రావుకు ఊరట

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వ పటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు భారీ ఊరట లభించింది. ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది.

2




# అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య

## చెన్నైలో ఆమె మాజీ ప్రియుడు అర్జున్ అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 5:** అమెరికాలో హైదరాబాద్ యువతి గోడిశాల నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతడిపై అమెరికా పోలీసులు అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిఘా అధికారుల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో ఇంటర్‌పోల్ పోలీసులు తమిళనాడులో అనుమానితుడిని అరెస్ట్ చేశారు. అతడిని అమెరికాకు అప్పగించేందుకు అధికారిక పక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. నిఖిత మృతి వార్త తెలియగానే ఆమె తండ్రి ఆనంద్ కన్నీరుమున్నీరయ్యారు. తన కుమార్తె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేయాలని అభ్యర్థించారు. ఇక, మీడియాలో వస్తున్నట్లుగా అనుమానితుడు అర్జున్ శర్మ.. తన కుమార్తె మాజీ బాయ్‌ఫ్రెండ్ కాదని తెలిపారు. అతడు చాలా మంది నుంచి అప్పులు తీసుకున్నట్లు చెప్పారు. 27 ఏళ్ల నిఖిత మేరీల్యాండ్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. డిసెంబరు 31 నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అమెరికా పోలీసులు తెలిపారు. అర్జున్ శర్మనే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, నిఖిత అదృశ్యంపై జనవరి 2న అర్జున్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. అదే రోజున అతడు భారత్‌కు తిరిగి వచ్చినట్లు అమెరికా పోలీసులు గుర్తించారు. అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అర్జున్ శర్మ ఆచూకీ కోసం యూఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత అధికారులతో సంప్రదింపులు జరిపాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

## ప్రభుత్వ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ, జనవరి 5:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్‌ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే గతంలోనే తన ఫోన్‌ను ట్యాప్ చేయించా రంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంలో విచారణ జరుగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎస్‌ఎల్పీలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

# సభను తప్పుదోవ పట్టించిన సీఎం

## స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు



**హైదరాబాద్, జనవరి 5 :** సీఎం రేవంత్‌రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. నదీ జలాలపై చర్చ సమయంలో సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సభాహక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పీకర్ సూచన మేరకు ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు అందజేశారు.

# మహిళా సాధికారితకు పెద్దపీట

**హైదరాబాద్, జనవరి 5:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్ర సాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇం దిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యు లు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్ సభ్యురాలుగా ఉ ండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్ల డించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సం ఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామ న్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మ హిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహి ళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో విస్తృతంగా సోలార్ పవర్

- వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం
- పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే
- మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** రాష్ట్రంలో సోలార్ పవర్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు. పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ. 519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. 'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 బూటఙ పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

# పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

## ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి లేఖ రాశాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్షంగా హాజరవుతానని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా- గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు

మొదటి పేజీ తరువాయి

వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 200 టీఎంసీలు తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఏపీ తరఫున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. అయితే ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు' అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

# బంగ్లాలో ఆగని హిందువుల హత్య

## మరో యువకుడిని కాల్చి చంపిన దుండగులు

**ఢాకా,జనవరి5 :** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై హత్యాకాండలు ఆగడం లేదు. సోమవారం సాయంత్రం 5ప్రాంతంలో అందరూ చూస్తుండగానే మరో హిందూ యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మృతిచెందగా, దుండగులు పరారయ్యారు. బంగ్లాదేశ్‌లోని జస్సోర్ జిల్లా కేశబ్పూర్ ఉపజిల్లా వార్డు నెంబర్-17లోని కొపలియా బజార్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. మృతుని కేశబ్రూర్ ఉపజిల్లాలోని అరువా గ్రామానికి చెందిన రాణాప్రతాప్ (45)గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, మార్కెట్‌కు వచ్చిన రాణాప్రతాప్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలిసిన మణిరాంపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఆఫీసర్ ఇన్‌చార్జి రజివుల్లా ఖాన్ తెలిపారు.



కొద్దికాలంగా దేశవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తరహా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గత మూడు వారాల్లో ఇది ఐదవది.

# వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే.. కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కేసీఆర్
- ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగం
- కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ కవిత వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బిజెపి నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 3న ఛైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు కవిత. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తోన్న.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. 'ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ళ దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు. ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను. నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు.' అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను'అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.




# నిలదీస్తామని పారిపోయారు

## చర్చ పెడితే తోకముడిచారు

### బీఆర్ఎస్ గైర్హాజరుపై మండిపడ్డ భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జనవరి 5:** ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు సభ నుంచి తోకముడిచారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభాపతిని అవమానపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బీఏసీ సమావేశంలో యక్ష ప్రశ్నలు వేసిన ఆ పార్టీ నాయకులు.. ఇప్పుడు అసలు కనిపించట్లేదన్నారు. "శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ, బయట చెప్పడం సమంజసం కాదు'అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇకపోతే బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు – రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

# ఓఎన్జీసీ పైపులైన్‌లో గ్యాస్ లీక్

మొదటి పేజీ తరువాయి

ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే పని మొదలు పెట్టారు. మలికిపురం మండలంలో గ్యాస్ లీకేజ్ విషయంపై మంత్రి సుభాష్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఆగస్టులోనూ ఇదే గ్రామంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ అయ్యింది. ఇక్కడ తరుచూ గ్యాస్ లీక్ అవుతున్న సంఘటనలు జరుగుతుండడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా దీని వల్ల తీవ్ర ప్రమాదం జరగొచ్చని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని.. లేదంటే గ్రామ ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ లీక్ ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఓఎన్జీసీ సిబ్బంది ÷ర్ ఇంజన్లతో మంటలు కంట్రోల్ చేస్తున్నారు.



## గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

### తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం

**అమరావతి :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకేజీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈ విషయంపై మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. తాము ఇప్పటికే లీకేజీ ఘటనపై స్థానిక అధికారులతో మాట్లాడామని.. సహాయ చర్యలను ముమ్మరం చేయాలని సూచించినట్లు సీఎంకు మంత్రులు వివరించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని... సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంటలను వెంటనే అదుపులోకి తెచ్చేలా చూడాలన్నారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులకు, అధికారులకు సీఎం సూచించారు. పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కాగా.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ గ్యాస్ లీకేజ్ అవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిస్థితిపై అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. భద్రతా చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

# బంగ్లా ఘటనలతో క్రికెట్‌కు ముడిపెట్టవద్దు

## అలా అయినే హసీనాను వెనక్కి పంపండి

### ఎంఐఎం అధినేత ఓవైసీ డిమాండ్



**హైదరాబాద్, జనవరి 5:** బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండలు జరుగుతున్న నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్ నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీవ్ చేయాలని దాని సహ యజమాని బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొంతమంది రాజకీయ నాయకులు తప్పుబడుతున్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ రాజకీయాలను, క్రీడలను కలపొద్దని హితవు పలికారు. ఇప్పుడు ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ.. రెహ్మాన్‌కు మద్దతుగా నిలిచారు. అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. 'పహల్గామ్ దాడి తర్వాత మనం పాకిస్థాన్‌తో ఏషియా కప్ క్రికెట్ ఆడాము. మీరు బంగ్లాదేశ్ పేసర్‌ను వెనక్కు పంపించేశారు. ఓ బంగ్లాదేశీ మహిళ ఇండియాలో నివసిస్తోంది. ఆమెను కూడా వెనక్కు పంపండి. ఎందుకు ఆమెను ఇండియాలోనే నిలిపి వేశారు? బంగ్లాదేశ్‌లో స్థిరత్వం ఇండియాకు ముఖ్యం. చైనా, పాకిస్థాన్ బంగ్లాదేశ్‌లో యాక్టీవ్‌గా ఉన్నాయి. మనం దాని గురించి కూడా బాగా ఆలోచించాలి' అని అన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో 2024 జులై, ఆగస్టు నెలల్లో జరిగిన మారణహోమానికి కారణం అప్పటి ప్రధాని షేక్ హసీనానేనంటూ ఆమెను ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్-1 దోషిగా తేల్చింది. హసీనాకు మరణ శిక్ష విధించింది. హసీనాకు మరణ శిక్ష వేయడాన్ని ఆమె కుటుంబసభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇంతకు తెగించారని మండిపడ్డారు. తన తల్లి ఇండియాలో క్షేమంగా ఉంటుందని ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జోయ్ స్పష్టం చేశాడు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం

ఏబీవీపీ మహాసభల్లో బండి సంజయ్




**హైదరాబాద్, జనవరి 5:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ రెండేళ్ల పాలన ఫలితంగా తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 6 వేల స్కూల్స్ మూసివేస్తే కాంగ్రెస్ పాలనలో వాటిని తెరవకపోగా ఒక్క ఏడాదిలోనే 1500 స్కూల్స్ మూసివేశారని చెప్పారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని గాలికొదిలేశారని, ఫీజు రీయంబర్స్ మెంట్ రాక కాలేజీలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కోసం తాము మద్దతిచ్చినా కొన్ని కాలేజీ యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వానికి భయపడి రాజీ పడుతున్నాయన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యా సమస్యలపై ఏబీవీపీ చేస్తున్న ఉద్యమాలు ఉధ్రుతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్సాస్సార్ కన్వెన్షన్ లో సోమవారం ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సభలకు రాష్ట్ర విద్యార్థి పరిషత్ అధ్యక్షులు హెచ్ సీయూ ప్రొఫెసర్ రావుల క్రిష్ణ, కార్యదర్శి రాంబాబు, కర్నె రామచందర్, గీతాసింగ్, భీమనపల్లి శ్రీకాంత్ హాజరైన ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా పానగల్ కు చెందిన సామాజిక కార్యకర్త, హెచ్ఐవీ బాధితులకు, వారి పిల్లలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న భీమనపల్లి శ్రీకాంత్ కు 'జనమంచి గౌరీశంకర్ జీ యువ పురస్కార్ ను' కేంద్ర మంత్రి అందజేశారు. అనంతరం మహాసభలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగం చేశారు.

# కవిత ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

### టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**హైదరాబాద్, జనవరి 5 :** కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు.



## సంపాదకీయం

# సవాళ్లతో ఎంతకాలమీ మోసాలు!

ప్రభుత్వాలు నడపడమంటే సవాళ్లు విసురుకోవడంలా ఉంది. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణలో రాజకీయం తారాస్థాయికి చేరింది. అసెంబ్లీలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే..దానిని బహిష్కరించి, అసెంబ్లీకి రాకుండాపోయిన బీఆర్ఎస్ ఆదివారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎవరి కోసం అన్నది చెప్పాలి. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయంపై పార్టీ ఆఫీసులో కూర్చుని కాకమ్మ కబుర్లు చెప్పడం ఎవరిని మోసం చేయడానికి అన్నదే ప్రశ్న. అదే విషయం అసెంబ్లీలో ఎందుకు చెప్పలేక పోయారు. గత పదేళ్లలో చేసిన దుర్మార్గాలను కప్పిపుచ్చి, తెలంగాణ ప్రజలక చేసిన ద్రోహాన్ని మరచి పోయి, తెలంగాణను దోచుకుని అప్పులకుప్ప చేసిన బిఆర్ఎస్ ముందు.. పదేళ్ల పాపాలపై చర్చించాలి. ప్రజలకు సమాధానం చెప్పాలి. తప్పులు చేయడం, అప్పులు చేయడం సవాళ్లు విసురుకోవడం అన్నది పరిపాటిగా మారింది. ఇది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ వ్యవహారం కాదు. ఇది తెలంగాణ ప్రజల వ్యవహారం. ఇరు పార్టీలు సవాళ్లతో సాగడం వల్ల నష్టపోయేది ప్రజలు తప్ప వీరు కాదని గుర్తించాలి. ఉచిత పథకాలు, సంక్షేమం పేరుతో ఖజానాను లూటీ చేయడంలో ఇద్దరూ పోటీ పడ్డారు. అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పోటీ పడుతూనే ఉంది. రాష్ట్రంలో కనీసం కొత్తగా రోడ్లు లేకున్నా దెబ్బతిన్న రోడ్డు వేయకుండా చోద్యం చూస్తున్నారు. కాళేశ్వరం, దరణి, ఫోన్ ట్యాపింట్ కేసుల్లో రెండేళ్లు గడిచినా గుండుసూది మొనంత కూడా ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు. అందుకే హామాలపైనా సవాళ్లు విసురుతున్నారు. ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. జీతాలకు కూడా సక్రమంగా లేని దుస్థితికి తెలంగాణను తీసుకుని వచ్చారు.. అందుకే ప్రజలు కూడా గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ప్రజలు బానిసలు కావడంతో వీరి ఆటలు సాగుతున్నాయి. అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఎన్నికల రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పథకాల ప్రకటనలో పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇది చూడవచ్చు. అప్పుల కారణంగా అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు మరోటి ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే లెక్కలేదు. ఇవన్నీ ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, వైకాపాలకు విమర్శల అస్త్రాలకుగా మారాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ రంగాలను ఉద్ధరించినట్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు దాపురించాయి. సూపర్ సిక్స్ అమలు చేయడం లేదుని కూటమిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ నష్టాలను భరించవు. ఈ ఇద్దరు తమ వ్యాపారాల నుంచి ప్రజలకు పంచరు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమిషన్లు తీసుకోవడం ప్రారంభించారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు మంత్రులు అదేపనిగా వసూళ్ల దందాకు తెరలేపారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల ఆరోపించారు. వారిపై నిఘా పెట్టామన్నారు. సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా ఫలితం దక్కడం లేదు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. వాటిని పంచడానికి హెలికాప్టర్లు వేసుకుని ఊరేగుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచి పెట్టడంలో తప్పు లేదు. కానీ అప్పులు చేసి పథకాలు అమలు చేయడం, చేయని వాటిపై సవాళ్లు విసరడం మామూలయ్యింది. సవాళ్ల ప్రజలను మభ్య పెట్టలేరు. ప్రజలు చైతన్యం అయితే తప్ప ఈ దుర్మార్గాల నుంచి బయటపడలేము.

# అమెరికా దాడి.. 40మంది పౌరుల మృతి

- విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో పలుచోట్ల అంధకారం
- వెనెజువెలా అధికార వర్గాలు వెల్లడి



**వాషింగ్టన్, జనవరి 5:** వెనెజువెలాపై అమెరికా సైన్యం చేసిన దాడిలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా వెనెజువెలాకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. మృతుల్లో సైనికులతో పాటు సాధారణ పౌరులు కూడా ఉన్నారని చెప్పారు. వెనెజువెలాపై భారీ దాడి అనంతరం అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. కాగా, వెనెజువెలాపై చేసిన దాడిలో తమవైపు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. కేవలం కొద్దిమంది మాత్రమే గాయపడ్డారని తెలిపారు. ఇది అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పేర్కొన్నారు. మనవైపు ప్రాణనష్టం లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ పూర్తి కావడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ దాడిలో అనేక విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. సాధారణంగా చొరబడలేని ప్రాంతాల్లోకి ప్రవేశించి, ఈ క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే అమెరికా లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. వెనెజువెలా దేశంపై దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో, అతని భార్య సిలియాను అగ్రరాజ్యం అమెరికా బందీగా పట్టుకుని న్యూయార్క్ నగరానికి తీసుకుపోయిన క్రమంలో ఆ దేశ రాజధాని కారకాస్, పొరుగున ఉన్న నగరాల్లో తీవ్ర భయం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆహారం కోసం పెద్దయెత్తున ప్రజలు బారులు తీరారు. పలు చోట్ల అంధకారం అలముకుంది. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయంతో చాలామంది ఇండ్లకే పరిమితమై పోయారు. చాలా సూపర్‌మార్కెట్లు మూతపడ్డాయి. తెరిచి ఉంచిన చిన్నచిన్న దుకాణాల వద్ద 500-600 మంది బారులు తీరారు. ముఖ్యంగా ముందు జాగ్రత్తగా బ్రెడ్ దుకాణాల వద్ద జనం పెద్దయెత్తున చేరుకున్నారు. అలాగే మందుల షాపుల వద్ద కూడా ప్రజలు ఎక్కువగా కన్పించారు. ఔషధాలతో పాటు అక్కడ అమ్మే కేన్డ్ ఫుడ్‌ను వారు కొనుగోలు చేయడం కన్పించింది. ప్రజలు తమ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చార్జింగ్ కోసం ఎగబడ్డారు. కాగా, అక్కడ స్వల్ప సంఖ్యలో ఉన్న భారతీయ కమ్యూనిటీ కోసం భారత ఎంబసీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించింది. దాని ద్వారా భారతీయులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు అందజేస్తున్నది. మెరికా దాడుల్లో పవర్ గ్రిడ్స్ దెబ్బ తినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లేక అంధకారం అలముకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా దళాలు కారకాస్ ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేయడంతో రాజధాని నుంచి 100 కి.మీ వరకు ఎలాంటి వైమానిక ప్రయాణ సౌకర్యం లేకుండా పోయిందని భారత సంతతికి చెందిన సునీల్ మల్హోత్రా అనే స్థానికుడు తెలిపారు. ప్రజలు ఆహారం కోసం అల్లాడుతున్నారని, షాపుల వద్ద పెద్దపెద్ద క్యూలు ఏర్పడ్డాయని, పౌరుల్లో భయం, అనిశ్చితి, ఆందోళన నెలకొందని చెప్పారు. ఫ్యూర్టే ట్యూయనా వద్ద అధిక నష్టం వాటిల్లిందన్నారు. కాగా, విద్యుత్తు స్తంభాల నుంచి అక్రమంగా వైర్లను లాగి కొందరు ఫోన్లకు చార్జింగ్ చేసే వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులపై స్థానిక సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ప్రజలకు ఎలాంటి ప్రకటనలు, సూచనలు చేయలేదు. అధికారులు కూడా పూర్తి అనిశ్చితి పరిస్థితుల్లో ఉన్నారు. అయితే అక్కడక్కడ పోలీసులు పరిస్థితులను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పౌరులు బయటకు రావడానికే భయపడుతున్నారని మల్హోత్రా తెలిపారు.

## వెనెజువెలాపై అమెరికా బలప్రయోగం

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా

**బీజింగ్, జనవరి 5:** వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయని అగ్ర రాజ్యంపై మండిపడింది. ప్రపంచ పోలీస్ లేదా అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించేందుకు ఏ దేశానికీ అధికారం లేదని పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. అంతర్జాతీయ న్యాయమూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షించాలి. అన్నిదేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది. అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.

# రూ.1, 37,400


### మళ్లీ పెరిగిన బంగారం ధరలు

### వెండి కిలో మరో ఆరువేలు పెరుగుదల

**హైదరాబాద్, జనవరి 5:** నాలుగు, ఐదు రోజులుగా కాస్త స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ దూ కుడు పెంచాయి. ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడంతో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,37,400కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 1,580 రూపాయలు పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1,450 పెరిగింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,37,550కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,26,100కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. గతం రోజుతో పోల్చుకుంటే కిలోకు ఏకంగా రూ.6 వేలు పెరిగింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2.47 లక్షలకు చేరింది. బంగారం, వెండిలో లాభాల స్వీకరణ జరిగి ధరలు తగ్గొచ్చు అనే అంచనాలు వినిపించిన నేపథ్యంలో ఇలా పెరగడం చాలా మంది నిపుణులకు షాకిస్తోంది.

# హిందూ మహిళపై లైంగిక దాడి

- చెట్టుకు కట్టేసి, జుట్టు కత్తిరించి దారుణం..
- వీడియో చిత్రీకరణ.. సోషల్‌మీడియాలో అప్‌లోడ్
- బంగ్లాదేశ్‌లో మరో ఘటన



**ఢిల్లీ, జనవరి 5:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే పలువురు హిందువులను కొట్టి చంపిన ఉదంతాలు మరువక ముందే తాజాగా ఓ హిందూ మహిళపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘోరం వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియాలో వచ్చిన కథనం ప్రకారం బంగ్లాదేశ్‌లోని జ్హైనైదా జిల్లా కలిగంజ్ ప్రాంతంలో 40 ఏళ్ల హిందూ వితంతు మహిళపై ఇద్దరు స్థానికులు శనివారం లైంగికదాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఆమెను చెట్టుకు కట్టేసి, జుట్టును కత్తిరించి, తీవ్రంగా హింసించారు. ఈ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మీడియాలో వెలువడిన కథనాల ప్రకారం.. బాధితురాలు కాలిగంజ్ మున్సిపాలిటీలోని వార్డు నంబర్ 7లో షాహిన్, అతని సోదరుడి నుంచి కొంత భూమిని, ఇంటిని కొనుగోలు చేసింది. ఈ కొనుగోలు తర్వాత షాహిన్ ఆమెకు అసభ్యకరమైన ప్రతిపాదనలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతడి వేధింపులను మౌనంగా భరిస్తూ అతడి ప్రతిపాదనను నిరాకరించానని అయితే గత శనివారం సాయంత్రం తన ఇంటికి ఇద్దరు బంధువులు వచ్చిన సమయంలో షాహిన్ అతడి సహచరుడు హసన్ ఇంట్లోకి ప్రవేశించి తనపై అత్యాచారానికి ఒడిగట్టారని పేర్కొంది. ఆ తర్వాత ఆమె నుంచి రూ. 37 వేలు డిమాండ్ చేశారని డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆమె బంధువులను దాడి చేసి తరిమికొట్టారని ఫిర్యాదు చేసింది. వారి చర్యలతో కేకలు వేయడంతో తనను చెట్టుకు కట్టేసి ఆమె జుట్టును కత్తిరించి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొంది. ఈ ఘటనలో స్పృహకోల్పోయిన బాధితురాలిని స్థానికులు రక్షించి జునైదా సదర్ ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఆమెపై దాడి చేసిన దురాగతానంతటిని నిందితులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

### మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు




**వాషింగ్టన్, జనవరి 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తున్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు. మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలటెరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷-లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లింద్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లింద్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సరికాదు

మొదటి పేజీ తరువాయి


ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు తెచ్చారని ప్రస్తావించారు. సోమవారం గుంటూరు జిల్లాలో జరిగిన తెలుగు మహాసభ లో పాల్గొని ప్రసంగించారు సీఎం చంద్రబాబు. కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను తాను పూర్తి చేశానని స్పష్టం చేశారు. కృష్ణా డెల్టా మోడరైజేషన్ పేరుతో నీటిని పొదుపు చేసి... ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామని వెల్లడించారు. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టామని వివరించారు. ఆంధ్ర ప్రాంతంలో చాగల్‌నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తీసుకువచ్చామని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చామని అన్నారు. విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ప్రత్యేక నిధులు ఇచ్చిందని వివరించారు, ప్రత్యేక చట్టం రూపొందించిందని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గోదావరి నీళ్లను తెలంగాణ వాడుకున్నా తాను ఏనాడు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదని అన్నారు. ప్రతి ఏడాది గోదావరి నుంచి సముద్రంలోకి మూడువేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పుకొచ్చారు. కృష్ణా-గోదావరి నదులు అనుసంధానం జరుగుతుందని వెల్లడించారు. ఏపీలోని నదులన్నింటినీ అనుసంధానించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి... అన్ని మాట్లాడటం లేదని అన్నారు..ఐక్యత గురించే తాను మాట్లాడతానని చెప్పుకొచ్చారు. నీటి విషయంలోనైనా, సహకారం విషయంలోనైనా తెలుగువారంతా కలిసి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినప్పుడు తాను అడ్డుపడలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు.. సమైక్యత అవసరమని చెప్పుకొచ్చారు. నీటి విషయంతో పాటు ఇతర అంశాల్లో తెలుగువారు కలిసే ఉండాలని సూచించారు. గంగా-కావేరి కలవాలని.. దేశంలో నీటి సమస్య పూర్తిగా తీరాలని.. అదే తన కోరిక అని చెప్పుకొచ్చారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కావాలని అన్నారు. గోదావరి నీటిని తెలంగాణ వాడుకుంటే ఎప్పుడూ అడ్డుచెప్పలేదని వ్యాఖ్యానించారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తన హయాంలో.. తెలంగాణలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




## ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి

### కేంద్రమంత్రి హర్దీపు సింగ్ పరి ట్వీట్‌కు సీఎం చంద్రబాబు రీ ట్వీట్

ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి సాధించిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విశాఖపట్నం రిఫైనరీ ఆధునికీకరణ ప్రాజెక్టు లో కొత్త రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మూడు రియాక్టర్లలో ఒకటిగా ఏర్పాటు అయిందని వెల్లడించారు. ప్రాంతీయ ఇంధన అవసరాలకు ఇది సమగ్ర పరిష్కారమని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతమిస్తోందని తెలిపారు. దేశ ఇంధన భద్రత బలోపేతమే లక్ష్యంగా పని చేస్తోందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు తీర ప్రాంతం ప్రపంచస్థాయి ర్గి÷ల్గ÷నింగ్ హబ్‌గా అవతరించనుందని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పెట్టిన ట్వీట్‌ను రీట్వీట్ పెట్టారు సీఎం చంద్రబాబు. విశాఖపట్నం ర్గి÷నైరీలో రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ ఫెసిలిటీ విజయవంతంగా ప్రారంభమైందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి వ్యాఖ్యానించారు. దేశ ఇంధన భద్రత దిశగా భారత్ మరో కీలక మైలురాయి సాధించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ కీలక మౌలిక వసతి ప్రాజెక్టు ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన అడుగని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో ఈ ప్రాజెక్టు అమలు అయిందని వివరించారు. పూర్తిగా దేశీయ సాంకేతికతతో నిర్మితమైన రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ ఫెసిలిటీ అత్యాధునిక ఇంజినీరింగ్ అద్భుతమని హర్దీప్ సింగ్ పూరి చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత భారీ ఇంజినీరింగ్ బ్లాక్స్‌లో ఒకటని వెల్లడించారు. రియాక్టర్ల తయారీ, అసెంబ్లింగ్ పూర్తిగా భారత్‌లోనే జరిగిందని వివరించారు. సంవత్సరానికి 3.55 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. ఆధునిక రెసిడ్యూ హైడ్రోక్రాకింగ్ టెక్నాలజీ ద్వారా 93 శాతం దిగువ స్థాయి చమురును విలువైన ఉత్పత్తులుగా మారుస్తుందని అన్నారు. ప్రతి బ్యారెల్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి దేశ అభివృద్ధికి ఇంధనంగా వినియోగించవచ్చని తెలిపారు. తూర్పు తీరాన్ని ప్రపంచ స్థాయి రిఫైనింగ్ హబ్‌గా నిలబెట్టే కీలక ప్రాజెక్టు ఇదని వెల్లడించారు.




## ఆర్టీఐకి తూట్లు?

### డ్రగ్స్ కంట్రోల్ విభాగంపై అనుమానాలు

- రికార్డులు లేవా..? బాధ్యత తప్పించుకోవడమేనా?
- సమాచారం ఇవ్వకుండా దారి మళ్లింపు
- సెక్షన్ 6(3)ను విస్మరించిన అధికారి
- ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల డేటా కూడా దాటవేత
- నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి ముప్పు
- మొదటి అప్పీల్ దాఖలు, చర్యలు కోరుతూ డిమాండ్

**నేటి సాక్షి, కరీంనగర్:** ప్రజల ఆరోగ్యానికి కీలకమైన బ్లడ్ బ్యాంకుల నియంత్రణ విషయంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఆర్టీఐ చట్టాన్ని తూట్లు పొడుతున్నట్టు తెలుస్తున్నది. కరీంనగర్ జిల్లాలో దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుకు చట్టవిరుద్ధంగా స్పందించిన వ్యవహారం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నెలవారీ నివేదికలు తమ వద్ద లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ఫోన్ కాల్ లో చెప్పడం, నియంత్రణ వ్యవస్థపైనే ప్రశ్నలు లేవనెత్తుతోంది. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్-2005 కింద 2025 నవంబర్ 15న కరీంనగర్ జిల్లా డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి ఆర్టీఐ దరఖాస్తు నెం.53/RTI/SUR/2025 దాఖలైంది. దానికి రికార్డుల్లో ఉండాల్సిన వివరాలు ఇవ్వకుండా, దరఖాస్తుదారుడిని నేరుగా బ్లడ్ బ్యాంకుల వద్దకు వెళ్లాలని సూచించడం చట్ట విరుద్ధమనే చెప్పవచ్చు. సంబంధిత అధికారికి దరఖాస్తును బదిలీ చేయాల్సిన బాధ్యతను పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ నిర్వర్తించలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేట్ సంస్థలే కాకుండా ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు సంబంధించిన సమాచారం కూడా ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. బ్లడ్ బ్యాంకులకు లైసెన్సులు జారీ చేయడం, తనిఖీలు నిర్వహించడం డ్రగ్స్ కంట్రోల్ విభాగం అధికార పరిధిలోనే ఉండగా, నివేదికలు లేవనడం విరుద్ధ వాదనగా మారింది. ఈ వ్యవహారం ఆర్టీఐ చట్టం సెక్షన్ 6(1), 7(1), 6(3)లకు స్పష్టంగా విరుద్ధమని న్యాయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. రక్త నిల్వలు, సరఫరా లాంటి అత్యంత కీలక అంశాలపై నిర్లక్ష్యం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు మొదటి అప్పీల్ దాఖలైనట్లు సమాచారం. బాధ్యులపై చర్యలు తీసుకుని, కోరిన సమాచారాన్ని రికార్డులతో సహా ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.




## అలరించిన ముగ్గుల పోటీలు

**నేటి సాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో సోమవారం పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొని, పంచాయతీ కార్యాలయ ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం న్యాయ నిర్ణేతలు అందంగా వేసిన ముగ్గుల్లో మొదటి ఐదింటికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారమిత అలుగునూర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్, సర్పంచ్ గుజ్జుల శ్వేతా ప్రణీత్ రెడ్డి, ఉప సర్పంచ్ పొలం మల్లేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను సర్వే చేయండి




**నేటిసాక్షి, తిమ్మాపూర్:** మన్నెంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూములను సర్వే చేసి, వాటిని సంరక్షించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పొన్నం సునీత అనిల్ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని కోరారు. సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఎమ్మార్వోను కలిసి పుష్పగుచ్చం అందజేసినట్లు సునిత అనిల్ గౌడ్ తెలిపారు. గ్రామంలో సర్వే నెంబర్ 6లో అన్యాకాంత్రమవుతున్న స్థలాన్ని పరిరక్షించాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన ఎమ్మార్వో త్వరలోనే సర్వే చేయిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

## రాష్ట్ర స్థాయి వేదికపై డఫొడిల్స్ విద్యార్థినులు

### ఇన్‌స్పైర్ మునక్ అవార్డ్స్ రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొననున్న స్టూడెంట్స్



**నేటి సాక్షి, నర్సంపేట :** రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే వేదికగా ఇన్‌స్పైర్ మునక్ అవార్డ్స్ రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలు జనవరి 7 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, ఇన్‌స్పైర్ కార్యక్రమం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా పాత రాజంపేటలోని విద్యానికేతన్ హై స్కూల్, డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం ప్రాంగణంలో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో నర్సంపేట లోని డఫొడిల్స్ పాఠశాల విద్యార్థినులు పాల్గొననుండటం విశేషం. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించడం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వడమే ఈ ప్రదర్శనల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి వేదికపై డఫొడిల్స్ పాఠశాల విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన ఆధునిక విజ్ఞాన నమూనాలు, వినూత్న శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. విజ్ఞానశాస్త్రాన్ని పుస్తకాలకే పరిమితం చేయకుండా, ప్రయోగాత్మకంగా నేర్చుకునే విధానానికి పాఠశాల యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండటంతో కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం పాల్గొనడం విద్యార్థులకు గొప్ప ఉత్సాహాన్ని, ప్రేరణను అందించనుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. డఫొడిల్స్ పాఠశాల చెర్మన్ చింతల నరేందర్ ప్రోత్సాహంతో, సైన్స్ ఉపాధ్యాయుడు సాయి కిరణ్ పర్యవేక్షణలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా చెర్మన్ చింతల నరేందర్ మాట్లాడుతూ, "విద్యార్థులు ప్రశ్నించాలి, ఆలోచించాలి, ప్రయోగాలు చేయాలి. అప్పుడే నిజమైన విజ్ఞానం పెంపొందుతుంది. ఇన్‌స్పైర్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే దిశగా దారి చూపుతాయి" అని అన్నారు. డఫొడిల్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటి చెప్పుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.






'సంగీతా'నికి.. సింతకాయలు రాలయ్!

- కోరుట్ల-ఖాజీపుర-3 అంగన్వాడీ సెంటర్లో ఐసీడీఎస్ సీడీపీవో ఆకస్మిక తనిఖీలు
- తనిఖీల్లో వెల్లడైన విస్తుపోయే నిజాలు
- ఆ సెంటర్ టీచర్ కోసం
- సీడీపీవో-సూపర్వైజర్లు రెండు గంటలపాటు నిరీక్షణ
- సెంటర్ తెరిచి ఉండదు.. పిల్లల జాడలేదు..
- రిజిస్టర్ల దిక్కులేదు.. స్టాకేమో కంటికి కనిపించదు
- ఏడాది కాలంగా తెరుచుకోని అంగన్వాడీ సెంటర్
- జియో-మ్యాపింగ్ పుణ్యమాని వెలుగులోకి వచ్చిన భాగోతం
- ఐసిడిఎస్ సూపర్వైజర్ నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల వరకు 15 ఏళ్లలో 20 సార్లకి పైగా తనిఖీలు
- ఎన్ని మెమోలిచ్చినా.. ఎంటికేమందం భయపడని 'సంగీతా' మేడం
- అయ్యా.. కలెక్టరయ్యా.. ఇదయ్యా 'ఇంటివద్దే స్టాకు' దాచుకునే ఈవిదగారి బంధారం

# నివేదిక సమర్పయామి!



- ఈ కథనమేంటో చూడాలని ఐసీడీఎస్ డీడబ్ల్యూఓకు కలెక్టర్ ఆదేశాలు
- చర్యలకు దిగిన మెట్ పల్లి సీడీపీవో
- అడగకున్నా 'సాయం చేయడానికి-సిద్ధం'గా ఉన్నానన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షురాలు
- నా చేతుల్లో ఏమీ లేదు.. ఇక అంతా కలెక్టర్ దయంటున్న డీడబ్ల్యూవో
- తప్పు జరిగిపోయింది కాపాడండని ఎవరినీ 'ఆశ్రయించని-టీచరమ్మ'!
- విలేకరులపై విషం కక్కిన 'ఓ-ఇద్దరు' అంగన్వాడీ టీచరమ్మలు?
- మాతో పెట్టుకున్న 'ఆ-ఇద్దరు విలేకరుల' గతి ఏమైందో తెలుసుకుంటే మంచిదట!

## 'నేటి సాక్షి' కథనానికి స్పందించిన జగిత్యాల కలెక్టర్

అంగన్వాడీ కేంద్రాల్లో కలకలం సృష్టించిన 'సంగీతా'నికి సింతకాయలు రాలయ్.! కథనం



'నేటి సాక్షి'లో ఆదివారం 'సంగీతా'నికి సింతకాయలు రాలయ్.! శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించారు. ఈ కథనం ఒక్క అంగన్వాడీ టీచర్ల వర్గంలోనే గాకా.. పాఠకలోకంలోనూ చర్చానీయాంశమైంది. అయితే.! ఈ వ్యవహారం మొత్తంలో 'ఓ-ఇద్దరు' అంగన్వాడీ టీచర్లకు మాత్రం మింగుడుపడక వార్త రాసిన 'నేటి సాక్షి విలేకరి'పై విషం కక్కినట్టు ప్రచారం జరుగుతోంది. తప్పు 'పనిదొంగలు' చేస్తే.. ఆ-బండారం బట్టబయలు చేసిన 'నేటి సాక్షి'పై తమ అక్కసు వెళ్లగక్కుతున్న వైనం తోటి అంగన్వాడీ టీచర్లే అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారం మొత్తం ఐసీడీఎస్ అధికారులే గాకుండా జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ కూడా దృష్టిపెట్టినట్టు చెవినపడింది. కోరుట్లలోని ఈ వార్తాకథనంలో వచ్చిన ఆ సెంటర్ టీచర్ సంగీత నిర్వాకం ఏంటో చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ డీడబ్ల్యూవో నరేష్ ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు రంగంలోకి దిగినట్టు తెలియవచ్చింది.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

### ఇంతకూ.. అసలేం జరిగింది?

కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఖాజీపుర-3 సెంటర్ నిర్వాహకురాలు సంగీతపై ఫిర్యాదులు రావడంతో మెట్ పల్లి ఐసీడీఎస్ సీడీపీవో మణి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీడీపీవో దృష్టికి విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఏడాది కాలంగా సరిగా సెంటర్ తెరవకపోవడం.. తనకు తోచిన పుడు రావడం.. చాలా సందర్భాల్లో ఆయా పై వదిలిపెట్టడం.. సెంటర్‌లో సరుకులు ఉంచకపోవడం.. పాలు.. గుడ్లు.. బియ్యం.. పప్పులు.. నూనెలు.. బాలామృతం వంటి సరుకులను టీచర్ సంగీత తన ఇంటివద్దే దించుకోవడం వంటివి సీడీపీఓకు సాక్ష్యాధారాలతో సహా దృష్టిలో పడింది. 'సంగీతా-ఇదంతా ఏంటని'? సూపర్‌వైజర్ అనితా.. సీడీపీఓ మణిలిద్దరూ నిలదీయడంతో ఎలాంటి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోవడంతో ఆమె అగ్గిబుగ్గైంది.! వరుసగా రెండు రోజుల పాటు సెంటర్ 'టీచర్ సంగీత' నిర్వాకంపై విచారణ చేపట్టిన సీడీపీవో మణికి సూపర్‌వైజర్‌నుంచి డీడబ్ల్యూవో వరకు తలదించుకునేలా.. ఎన్నో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దీంతో సంగీతపై చర్యలు తీసుకోక తప్పదని సీడీపీవో తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్నతాధికారులను ఆశ్రయించారు.



### డీడబ్ల్యూఓకు సీడీపీవో నివేదిక

ఖాజీపుర-3 సెంటర్ నిర్వాహకురాలు సంగీత తన అంగన్ వాడీ కేంద్రాన్ని సరిగా నడపట్లేదని స్పష్టమైంది. సెంటర్ కు ఎవరో ఉన్నతాధికారులు వచ్చారని తెలుసుకున్న స్థానికులు.. గర్భిణులు.. బాలింతలు వచ్చి అధికారులను నిలదీశారు. ఇష్టం వచ్చినపుడు సెంటర్ తెరవడం.. ప్రభుత్వం అందించే సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం.. వాటిని గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసిన వైనంపై స్థానిక ప్రజలు సీడీపీఓకు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈ వ్యవహారం అంతా కలిపి 'నేటి సాక్షి'లో కథనంగా రావడంపై అధికారుల్లో కదలిక వచ్చింది. ముఖ్యంగా కలెక్టర్ సీరియస్ గా ఉండడంతో డీడబ్ల్యూఓ నరేష్ కు.. ఆయన సీడీపీవో మణికి ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఆమె టీచర్ సంగీతకు ఒక మెమో ఇచ్చారు. ఈ మేరకు బాధ్యురాలు సంగీతను మెట్‌పల్లి సీడీపీఓ మణి తన కార్యాలయానికి పిలిపించి ఒక సంజాయిషీ లేఖ రాయించుకున్నారు. తాను తీసుకున్న చర్యలను.. సంజాయిషీ లేఖను ఒక నివేదికను తయారు చేసి జిల్లాస్థాయి అధికారి నరేష్ కు అందజేశారు. ఇక తనకు అందిన నివేదికను కలెక్టర్ సత్యప్రసాద్ కు అందించాక తదుపరి చర్యలకు నిరీక్షించక తప్పదని అధికారవర్గాల నుంచి అందిన సమాచారం.



### చేజేతులా..సంగీతనే నాశనం చేసుకుంటోందట.!

తన 15 ఏళ్ల అంగన్వాడీ టీచర్ జీవితకాలంలో ఆమె సెంటర్ ను 20 సార్లకి పైగా ఎంతో మంది అధికారులు తనిఖీలు నిర్వహించినట్టు స్వయానా డీడబ్ల్యూవో నరేష్ నోటి నుంచి వచ్చినట్టు తెలిసింది. తనే స్వయంగా ఓ నాలుగు సార్లు తనిఖీకి వచ్చినట్టు.. అప్పుడు తాను మానవతా దృక్పథంతో మెమో ఇచ్చి.. మందలించి వదిలేసినట్టు ప్రచారం జరుగుతోంది.! నిరంతరం సీడీపీవోలు.. సూపర్‌వైజర్లు పలుమార్లు తనిఖీలు చేపట్టగా ప్రతీసారి మెమో ఇవ్వడం.. మందలించడం జరుగుతూనే ఉంది.. ఆమె ఎప్పటిలాగే నిర్లక్ష్యంగా.. బాధ్యతారాహిత్యంగా ఉంటూనే ఉందని ఆ అధికారి పేర్కొన్నట్టు వినిపించింది. ఇప్పుడిక తన పరిధి దాటి కలెక్టర్ టేబుల్ పైకి చేరింది.. తాను చేసేదేం లేదని చేతులెత్తేసినట్టు సమాచారం.

### 'పిలిచి పిల్లనిస్తాంటే.. కులం నాదాన్' అన్నట్టుందట'!

నిర్లక్ష్యం .. బాధ్యతారాహిత్యం..ఆమెది.! ఆమె ఒక్కతి చేసిన కథకు మిగిలిన తోటివారందరినీ దోషిగా ఇరికించిందని కోరుట్ల లోని మిగితా 57 మంది అంగన్వాడీ టీచర్లలో కలవరం మొదలైంది.! అయితే.. దోషిగా నిలబడ్డ సంగీత తనకు ఆపద వచ్చిందని.. తమ యూనియన్ ని ఆశ్రయిస్తే.. కాళ్లావేళ్లాపడి.. ఇదే 'చివరి సారి తప్పు'గా భావించి వదిలేయండని అడిగే వాళ్లం.! ఇప్పుడేమైంది.. సంగీత రాకున్నా.. సూపర్‌వైజర్ అనితను.. సీడీపీఓ మణిని.. డీడబ్ల్యూఓ నరేష్ ను తానే స్వయంగా వదిలేయండి.. మరోసారి మానవతా దృక్పథంతో ఆలోచించి క్షమించమని రెండు రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నట్టు అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ 'నేటి సాక్షి'తో అన్నారు. కానీ, సంగీత తమను ఇంకా ఆశ్రయించలేదని.. అడిగితే సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆమె పేర్కొంటున్నారు. ఇదెలా ఉందంటే.? 'పిలిచి పిల్లనిస్తాంటే.. మీ కులం నాదాన్' అని లేచి వెళ్లిపోయినట్టుందని ఆమె చెప్పుకొచ్చారు.!

### ఆమె.. ఎవరినీ 'ఆశ్రయించకపోవడం' వెనుక ఎవరున్నారో?

ఈ 'ఖాజీ పుర'-3 సెంటర్ టీచర్ సంగీత వ్యవహార శైలి అందరికీ కోపం తెప్పిస్తుందంటారు.! ఇంట్లో ఆమె భర్తనే 'విధి నిర్వహణ'పై తిడుతుంటారని తెలియవచ్చింది. చిన్నారులు.. గర్భిణులు.. బాలింతరాళ్లపై కరుణతో ఉండాలని.. బాధ్యతగా పనిచేయాలని వందలసార్లు చీవాట్లు పెడుతుంటారని వినిపించింది. ఇక లబ్ధిదారులు విసుక్కోవడాలైతే లెక్కేలేదంట. ఈమె పద్ధతీ.. ప్రవర్తన చూసి ఆ వార్డు కౌన్సిలర్ ఎన్నో సార్లు 'స్వప్రయోజనం' పొంది ఉంటుందని.. ఎన్నోసార్లు పంచాయతీలయ్యాయని చెవులు కొరుక్కుంటున్నారు. దీంతో ఇప్పుడు సమస్య పీకకు చుట్టుకున్నా కూడా ఇదే నిర్లక్ష్యం. తాను ఎవరికీ 'లొంగేది లే' అని అహం ప్రదర్శించడం అవసరమా? అని కొందరు తోటి టీచర్లే ముచ్చటించుకుంటున్నారు. ఈమె ఇలా.. ప్రవర్తించడానికి తమ తోటి టీచర్లలో ఓ 'ఇద్దరు-ముగ్గురు' టీచర్లు క్రమం తప్పకుండా చెడగొట్టడమే పనిగా పెట్టుకున్నారని చెవులు కొరుక్కుంటున్నారు.




### 'నేటి సాక్షి'పై విషం కక్కుతున్న 'ఓ ఇద్దరు టీచరమ్మలు'?

ప్రభుత్వం బాధ్యతగా పనిచేసుకోమని చెబితే.. నిబంధనలు తుంగలో తొక్కి.. నిర్లక్ష్యానికి.. బాధ్యతారాహిత్యానికి బ్రాండ్ అంబాసిడర్లు గా మారడానికి కోరుట్లలోని 60 మంది టీచర్లలో 'ఓ ఇద్దరు' టీచర్లు పనిగట్టుకుని రెగ్యులర్ గా దుష్ప్రచారం చేస్తూనే ఉంటరటన్న ప్రచారం జరుగుతోంది. తాము మా ఇష్టం వచ్చినట్టు సెంటర్లు నడుపుతాం.. అడగడానికి ఎవరికీ రైట్స్ లేవు.. మేం ఇచ్చిందే రిపోర్టు.. మాకు మా సూపర్ వైజర్, సీడీపీవోలే భయపడతారు.. ఆఫ్టాల్ 'విలేకరులు' ఎంత? మా మీదనే 'వార్త'లు రాసేంత దమ్ముందా? రాసిన విలేకరులు ఎన్నిరోజులు పనిచేసి బతికి బట్ట కడతారో మేమూ చూస్తాం.! ఇది వరకు మేం 'ఓ ఇద్దరు విలేకరులకు' ఏ గతి పట్టించామో? వాడు తెలుసుకుంటే మంచింది. ప్రతోడు యాడ్స్ అంటూ బెదిరిస్తూనే ఉన్నారు? అసలు యాడ్స్ మేం మీకు ఎందుకు ఇవ్వాలి? మరీ అవసరమైతే మేం 60 మందిమి తలా రూ.100 ఇస్తాం.. వచ్చి తీసుకుపోమనండి. మా టీచర్ల కుటుంబీకుల్లోనూ కొందరు విలేకరులు ఉన్నారు.! తెలుసుకో? దమ్ముంటే మాలో 'కొందరి' జోలికి వచ్చి చూడండి.. చూపిస్తాం మా తడాఖా'.. అంటూ 'నేటి సాక్షి' విలేకరిపై 'ఓ ఇద్దరు' టీచరమ్మలు 'విషం కక్కినట్టు' ప్రచారంలోకి వచ్చింది.



### ఓకే.. థాంక్స్ టీచరమ్మలూ..

#### ఇక సదా మీ వెన్నంటే ఉంటాం..

ఒకే థాంక్స్.. టీచరమ్మలూ.! ఏం పర్లేదు.. మీ వార్నింగులకు చాలా ధన్యవాదాలు.! మీరేం కంగారు పడకండి.. ఇక నుంచి మీలో ప్రభుత్వ నియమ-నిబంధనల మేరకు బాధ్యతగా పని చేసుకునే వారిని తప్ప.. మిగిలిన మీలాంటి బాధ్యతారాహిత్య 'ఆడపడుచు'లకు నీడలా 'నిఘా నేత్ర'మై మీ వెన్నంటే ఉంటుంది పాత్రికేయ లోకం. ముఖ్యంగా 'నేటి సాక్షి'.. అంటే.. సెంటర్లు తెరిచే ఉంటున్నాయా? సరుకులు లబ్ధిదారులకు పంపిణీ అవుతున్నాయా? లేక పక్కదారి పడుతున్నాయా? సొంతింట్లో నడుస్తున్నాయా? కిరాయింట్లో నడుస్తున్నాయా? టీచర్ ఉండేదో చోట.. సెంటర్ మరోచోట నిర్వహిస్తున్నారా? వంటి ఎన్నో అంశాలపై 'నిఘా' కథనాలతో పాటు 'అంగన్ వాడీ టీచర్ల పనికి మించిన బాధ్యతల బరువు వంటి బాధలను కూడా 'నేటి సాక్షి'లో వరుస కథనాలుగా వెలుగులోకి తెచ్చేందుకు మా వంతు ప్రయత్నం చేస్తామని ప్రామిస్ చేస్తున్నాం.!! లెట్స్ వెయిట్ అండ్ సీ..!



## టెన్నిస్ అసోసియేషన్ నుంచి వైదొలిగిన జకోవిచ్

సెర్బియన్ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తాను ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ నుంచి వైదొలుగుతున్నట్లు తాజాగా ప్రకటించాడు. అయితే ఈ అసోసియేషన్?ను నొవాక్ ఆరేళ్ల కిందట వాసెక్ పోస్పిసిల్?తో కలిసి స్థాపించాడు. టెన్నిస్ ప్లేయర్లక్కు రీర్ పరంగా మద్దతుగా నిలుస్తూ, సహాయం చేయాలన్న ఉద్దేశంతో ఇది స్థాపించారు. అయితే ఇప్పుడు అసోషియేషన్‌లో పారదర్శకత లోపించిందని సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ షేర్ చేశాడు. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్ల అసోసియేషన్? నుంచి పూర్తిగా తప్పుకోవాలని అనుకుంటున్నాను. చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. టెన్నిస్ ప్లేయర్లకు మద్దతు, ఇండిపెండెంట్ వాయిస్ ఇచ్చేందుకు వాసెక్?తో కలిసి నేను ఈ ఆర్గనైజేషన్ స్థాపించినందుకు గర్విస్తున్నా. కానీ, అసోసియేషన్?లో పారదర్శకత లోపించింది. ప్రస్తుతం సంస్థ నడుస్తున్న విధానాలతో నేను ఇకపై ఏకీభవించలేనని అర్థమైపోయింది‌ః అని జకోవిచ్ పోస్ట్?లో రాసుకొచ్చాడు. అలాగే ఇకపై తన పూర్తి దృష్టంతా టెన్నిస్ రీర్?, కుటుంబంపైనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఃఇకపై నా ఫోకస్ మొత్తం టెన్నిస్ రీర్?, నా కుటుంబం, నా విలువలను ప్రతిబింబించే క్రీడలకు నా వంతు సహకారం అందిస్తాను. ఇందులో కొనసాగుతున్న క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కానీ ఈ అసోసియేషన్‌తో నా ప్రయాణం మాత్రం ఇక్కడితో ముగిసింది‌ః అని జకోవిచ్ పేర్కొన్నాడు. తన తోటి ఆటగాడు వాసెక్? పోస్పిసిల్?తో కలిసి జకోవిచ్ 2019లో ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. ప్రొఫెషనల్ టెన్నిస్‌ను నిర్వహిస్తున్న తీరుపై ఆటగాళ్లలో అసంతృప్తి పెరగడంతో దీనికి స్థాపించారు. ఈ ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ అనేది పురుష, మహిళా టెన్నిస్ ఆటగాళ్ల సంఘం. ఈ సంస్థ క్రీడా పాలక సంస్థలతో సంబంధం లేకుండా ఆటగాళ్లకు స్వేచ్ఛనివ్వడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ , ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ ఉన్నాయి. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్‌ను ప్రారంభానికి ముందు, ఆటగాళ్లు ప్లేయర్ కౌన్సిల్ ద్వారా ప్రాతినిధ్యం వహించేవారు. ఇది పర్యటన నిర్మాణంలో ఒక సలహా సంస్థగా ఉండేది. అయితే ఆటగాళ్లు తమ స్వరాన్ని, ఆందోళనలను వ్యక్తపరిచేందుకు ఒక బలమైన, స్వతంత్ర వేదిక అవసరమని జకోవిచ్ భావించాడు. దీంతో 2019లో వైదొలిగి ఈ అసోసియేషన్?కు ప్రారంభించాడు. తాజాగా ఇందులో నుంచి కూడా బయటకు వచ్చేశాడు.

## ఇకపై వైట్‌వాష్‌లు ఉండవు.. టెస్టుల్లో సర్జికల్ స్ట్రైకులే..

భారత టెస్టు క్రికెట్‌లో గత కొంతకాలంగా ఎదురవుతున్న పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని టీమిండియా టెస్ట్ ప్టెన్ శుభ్‌మన్ గిల్ నడుం బిగించారు. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0-2తో వైట్‌వాష్‌కు గురైన తర్వాత, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకూడదని గిల్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. దీని కోసం ఆయన ఏకంగా బీసీసీఐ ముందు ఒక భారీ డిమాండ్ ఉంచారు. గిల్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత 13 నెలల కాలంలో టీమిండియా సొంతగడ్డపై రెండుసార్లు టెస్ట్ సిరీస్‌లలో ఘోరంగా ఓడిపోయింది. ముఖ్యంగా సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఓటమి బీసీసీఐని ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు, టీమ్ లీడర్‌షిప్ గ్రూప్‌తో బోర్డు నిర్వహించిన సమీక్ష సమావేశంలో శుభ్‌మన్ గిల్ తన మనసులోని మాటను బయటపెట్టారు. కేవలం నాలుగు రోజుల ముందు ప్రాక్టీస్ చేసి మైదానంలోకి దిగడం వల్ల ఫలితాలు రావడం లేదని, అందుకే ఇకపై ప్రతి టెస్ట్ సిరీస్‌కు ముందు కనీసం 15 రోజుల ట్రైనింగ్ క్యాంప్ ఉండాలని గిల్ డిమాండ్ చేశారు. గతేడాది ఆసియా కప్ ముగిసిన కేవలం 4 రోజులకే టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. అలాగే దక్షణాఫ్రికాతో సిరీస్ ముందు కూడా గిల్, ఇతర టెస్ట్ స్పెషలిస్ట్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 4 రోజులకే మ్యాచ్‌లోకి దిగారు. ఇలాంటి బిజీ షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు రెడ్ బాల్ క్రికెట్‌కు అలవాటు పడే సమయం దొరకడం లేదని గిల్ వాదిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. గిల్ ప్లానింగ్ పట్ల బీసీసీఐ, సెలెక్టర్లు చాలా సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గిల్ విజన్, క్లారిటీ చూసి బోర్డు కూడా అతనికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. భారత జట్టు బిజీ షెడ్యూల్ మధ్య 15 రోజుల క్యాంప్ నిర్వహించడం కత్తి మీద సామే. అయితే, దీని కోసం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఇప్పుడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను వాడుకోవాలని బోర్డు భావిస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బిజీగా ఉంటే, ఈ రెడ్ బాల్ క్యాంప్ బాధ్యతలను వివిఎస్ లక్ష్మణ్ కు అప్పగించే ఆలోచనలో కూడా బోర్డు ఉంది. గిల్ డిమాండ్ గనుక అమలైతే, భారత టెస్ట్ జట్టు మరింత పటిష్టంగా తయారవుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# జనవరి 9 నుంచి మహిళా ప్రీమియర్ లీగ్ ప్రారంభం

### 5 జట్ల మధ్య జరగనున్న 22 మ్యాచ్‌లు

### ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో టికెట్లు




మహిళా ప్రీమియర్ లీగ్ నాల్గో ఎడిషన్ జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరుగుతుంది. 5 జట్ల మధ్య మొత్తం 22 మ్యాచ్‌లు నవీ ముంబైలోని పాటిల్ స్టేడియం, వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతాయి. మ్యాచ్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, ధర కేవలం 100 రూపాయల నుంచి ప్రారంభమవుతుంది. మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ నవంబర్ 29న విడుదలైంది. మొదటి మ్యాచ్ జనవరి 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య నవీ ముంబైలో జరుగుతుంది. ఆ తర్వాత జనవరి 10న డబుల్ హెడర్ ఉంది. మొదటి మ్యాచ్ యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య, రెండో మ్యాచ్ ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతుంది. అన్ని మ్యాచ్‌ల టిక్కెట్లు 100 రూపాయల నుంచి ప్రారంభమవుతాయి. మహిళా ప్రీమియర్ లీగ్ అధికారిక వెబ్‌సైట్ లేదా డిస్ట్రిక్ట్ బై జోమాటో వెబ్‌సైట్ , యాప్‌లో టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.వార్త రాసే సమయానికి, కేవలం 100 రూపాయల ధర గల టిక్కెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. ముందుగా మహిళా ప్రీమియర్ లీగ్ వెబ్‌సైట్ లేదా డిస్ట్రిక్ట్ బై జోమాటో వెబ్‌సైట్‌కి వెళ్లండి. మీకు టిక్కెట్ల విభాగం కనిపిస్తుంది, దానిపై క్లిక్ చేస్తే అన్ని మ్యాచ్‌ల జాబితా మీ ముందు వస్తుంది. ఫిబ్రవరి 1 వరకు డబుల్ రౌండ్ రాబిన్ మ్యాచ్‌లు జరుగుతాయి, అన్ని మ్యాచ్‌ల 100 రూపాయల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. జనవరి 9న జరిగే ప్రారంభ మ్యాచ్‌కు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఈ మ్యాచ్ టిక్కెట్లు మళ్లీ అందుబాటులోకి వస్తాయి. ఉదాహరణకు, మీరు జనవరి 10న జరిగే డబుల్ హెడర్ మొదటి మ్యాచ్ టిక్కెట్ బుక్ చేయాలనుకుంటే, మీరు ఆ మ్యాచ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

## నా ఫొటోలను మార్ఫింగ్ చేయవద్దు

### భారత మహిళా క్రికేటర్ ప్రతీకా రావల్



దయచేసి తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని ఎక్స్ ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్ కోరింది. ఇటీవల ఎక్స్‌వేదికగా ఫొటోలను ఎడిట్ చేయడం, మార్ఫ్ చేయడం ట్రెండింగ్‌గా మారిన సంగతి తెలిసిందే. కొన్ని ఫొటోల నుంచి వ్యక్తులను తీసేయడం, డ్రెస్ కలర్స్‌ను మార్చడం వంటి పనులను నెటిజన్లు గ్రోక్ సాయంతో చేశారు. గత కొన్నిరోజులుగా ఎక్స్‌లో ఇది బాగా ట్రెండ్ అవుతుంది. ఈ క్రమంలోనే తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని, ఇతర యూజర్లు అడిగినా నిరాకరించాలని గ్రోక్‌ను ఎక్స్ వేదికగా ప్రతీకా రావల్ విజ్ఞప్తి చేసింది. ఆమె అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన గ్రోక్.. వ్యక్తిగత గోప్యతను కాపాడుతామని మాట ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు నెట్టింట వైరల్‌గా మారాయి. ఃహే ఏస్త్రతీశీని, గతంలో నేను పోస్ట్ చేసినవి, భవిష్యత్తులో నేను పోస్ట్ చేయబోయే నా ఫొటోలను తీసుకోవడానికి.. మార్ఫింగ్, ఎడిట్ చేయడానికి నేను మీకు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా నా ఫొటోలను ఏదైనా విధంగా ఎడిట్ చేయమని కోరితే, దయచేసి ఆ అభ్యర్థనను తిరస్కరించండి. ధన్యవాదాలు.ఃఅని ప్రతీకా రావల్ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్‌కు గ్రోక్ స్పందించింది. ఃఅర్థమైంది ప్రతీకా. నేను మీ వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తాను. అనుమతి లేకుండా మీ ఫొటోలను ఉపయోగించడం, మార్ఫ్, ఎడిట్ చేయడం చేయను. అటువంటి అభ్యర్థనలు ఏవైనా వస్తే వాటిని తిరస్కరిస్తాను. నాకు తెలియజేసినందుకు ధన్యవాదాలు.ఃఅని బదులిచ్చింది. అయితే ఈ ఎక్స్ ఖాతా నిజంగానే ప్రతికాకు సంబంధించినదా? కాదా? అనేదానిపై స్పష్టమైన సమాచారం లేదు. బ్లూ టిక్, ప్రతికా రావల్ ఫొటోలు ఉన్నప్పటికీ.. ఈ మధ్య ఫేక్ అకౌంట్స్‌కు కూడా డబ్బులు తీసుకొని ఎక్స్ బ్లూ టిక్స్ ఇస్తుండటంతో గందరగోళం నెలకొంది. ప్రతీకా ట్వీట్.. ఏఐ సాధనాలతో చేస్తున్న ఫొటో మార్ఫింగ్‌లపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. భారత మహిళల వన్డే ప్రపంచకప్ విజయంలో ప్రతీకా రావల్ కీలక పాత్ర పోషించింది. గాయంతో సెమీఫైనల్‌తో పాటు ఫైనల్‌కు దూరమైన ఆమె.. 6 ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌పై శతకం సాధించడంతో పాటు ఆస్ట్రేలియా 75 పరుగులతో సత్తా చా టింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆమె చీల మండ, మొకాలి గాయాలకు గురైంది. ప్రస్తుతం ఆ గాయాల నుంచి కోలుకుంటుంది. భారత్ తరఫున 23 వన్డేలు ఆడిన ప్రతికా 50.45 సగటుతో 1,110 పరుగులు చేసింది.

## మ్యాచ్‌లను తరలిస్తే ఎవరికి నష్టం?




భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరుతోంది. ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేయడంతో బంగ్లా క్రికెట్ బోర్డు గుర్రుగా ఉంది. ఇప్పటికే ఐపీఎల్ ప్రసారాలను బంగ్లాదేశ్‌లో బ్యాన్ విధించింది. భద్రతా కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపించేందుకు నిరాకరిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ మ్యాచ్‌లు ఇప్పటికే శ్రీలంకలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తాజాగా బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లు భారత్ వెలుపల నిర్వహించాలని ర్విస్ట్ చేసింది. అయితే ఈ విషయంపై ఐసీసీ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఒకవేళ బంగ్లాదేశ్ మ్యాచ్‌లు భారత్‌లో నిర్వహించకపోతే.. బీసీసీఐకి ఏమైనా నష్టాలు ఎదు-రవుతాయా..? లేదా ఐసీసీ నష్టాన్ని భరిస్తుందా..? టీ20 ప్రపంచ కప్ ఈవెంట్ ఐసీసీ నిర్వహించే ఈవెంట్. ఈ ఈవెంట్‌కు సంబంధించి టిట్, స్పాన్సర్‌షిప్, ప్రసార ఆదాయం నేరుగా బీసీసీఐకి అందదు. ఐసీసీకి సంబంధించిన ఆదాయాన్ని మొత్తాన్ని బిజినెస్ కార్పొరేషన్ ఈవెంట్ నిర్వహిస్తుంది. టీ20 ప్రపంచకప్‌ను బీసీసీఐ నిర్వహించడానికి మాత్రమే పరిమితం. టీ20 ప్రపంచ కప్ నుంచి బీసీసీకి ఆదాయం మ్యాచ్-రోజుల మిగులు, ఇతర స్పాన్సర్‌షిప్‌ల నుంచి వస్తుంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. దీజజ× ఆదాయంపై మరీ గణనీయంగా ప్రభావం చూపదు. బీసీసీఐ నష్టాలను చవిచూస్షి.. అవి మ్యాచ్-రోజు ఆర్థిక వ్యవస్థకే పరిమితం అయ్యే అవకాశం ఉంది. టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి.. ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బంది, ఇతర అధికారులకు వసతి, విమాన బుకింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ప్రస్తుతం కోల్‌కతా, ముంబైలలో ఆడటానికి షెడ్యూల్ అయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు మారితే.. ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి హోటల్ బుకింగ్‌లు, విమాన ప్రయాణ ఖర్చులను ఐసీసీ భరిస్తుంది. బంగ్లా మ్యాచ్‌లను తరలిస్తే.. ఆ టీమ్‌తో పోటీ పడే ఇతర జట్ల ఆటగాళ్లను కూడా వేర్వేరు వేదికల్లో హోటల్స్, విమానా టిట్స్ బుక్ చేయాల్సి ఉంటుంది. దీంతో మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. బీసీసీఐ కంటే.. ఐసీసీకే ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, వెస్టిండీస్ జట్లు గ్రూప్ జలో ఉన్నాయి. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్ ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో తలపడనుంది.

## సౌతాఫ్రికాలో వైభవ్ సూర్యవంశీ రచ్చ



సౌతాఫ్రికా గడ్డపై భారత అండర్-19 ప్టెన్ వైభవ్ సూర్యవంశీ పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన అద్భుత బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడు, తాజాగా ప్రోటీస్ బౌలర్లను వణికించాడు. బెనోనీలో జరిగిన రెండో వన్డేలో కేవలం 24 బంతుల్లోనే 68 పరుగులు చేసి టీమిండియాకు భారీ ఆరంభాన్ని ఇచ్చాడు. సౌతాఫ్రికా నిర్దేశించిన 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ప్టెన్ వైభవ్ సూర్యవంశీ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డ వైభవ్, మైదానం నలుమూలలా బంతుల్ని తరలించాడు. ఈ క్రమంలో కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని రిషబ్ పంత్ పేరిట ఉన్న భారత రికార్డును తిరగరాశాడు. మొత్తం 24 బంతుల్లో 10 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 68 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అంటే అతను చేసిన మొత్తం పరుగుల్లో 64 పరుగులు కేవలం బౌండరీల (10 సిక్సర్లు ం 1 ఫోర్) ద్వారానే రావడం విశేషం. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా అండర్-19 జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. జేసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. భారత స్పిన్నర్ కిషన్ సింగ్ 8.3 ఓవర్లలో 46 పరుగులిచ్చి 4 వైట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 245 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్ఎస్ అంబరీష్ రెండు వైట్లు తీయగా, దీపేష్, కనిష్క్, ఖిలన్ పటేల్ తలో వైట్ పడగొట్టారు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై అత్యంత వేగవంతమైన సెంచరీ చేసి రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడు సౌతాఫ్రికాలోనూ అదే ఫామ్‌ను కొనసాగిస్తూ జూనియర్ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నాడు. వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. కేవలం 11 ఓవర్లలోనే టీమిండియా 100 పరుగుల మార్కును దాటేసిందంటే వైభవ్ విధ్వంసం ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.




# విదేశాల్లో ద రాజాసాబ్ మేనియా

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల అమ్మకాలు



ప్రభాస్ హీరోగా,దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకి సంబంధించిన సంకేతాలు ఇస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి విదేశీ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు బలంగా ప్రారంభమయ్యాయి. ప్రభాస్ క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా, ఉత్తర అమెరికాలో ఇప్పటివరకు 17,500కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే యూకే మార్కెట్‌లో కూడా 17,500కు పైగా ప్రీ-సేల్స్ నమోదు కావడం విశేషం. 2026 జనవరి 8న ప్రారంభమయ్యే ప్రీమియర్ షోలకే ఇంత భారీ స్పందన రావడం, సినిమా ఓవర్సీస్‌లో బలమైన ఓపెనింగ్ రాబోతుందనే సంకేతాలను ఇస్తోంది. దర్శకుడు మారుతి ఈ సినిమాను దాదాపు మూడేళ్ల పాటు శ్రమించి తెరకెక్కించినట్టు సమాచారం. పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్‌ను సరికొత్తగా చూపించాలనే లక్ష్యంతో ఈ సినిమా రూపొందించబడింది. 'బాహుబలి', 'సలార్' లాంటి ఇంటెన్స్ పాత్రల తర్వాత ప్రభాస్‌ను లైట్ హార్టెడ్, ఫుల్ ఎంటర్‌టైనర్‌లో చూడాలన్న అభిమానుల ఆశలను 'ది రాజాసాబ్' తీర్చబోతుందనే అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ది రాజాసాబ్' సినిమాను తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రభాస్‌కు ఉన్న మార్కెట్‌ను పూర్తిగా వినియోగించుకునేలా మేకర్స్ రిలీజ్ ఎ÷-లాన్ చేస్తున్నారు. మొత్తానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతోనే ఓవర్సీస్‌లో హీట్ పెంచుతున్న 'ది రాజాసాబ్'? సంక్రాంతి రేసులో పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.

## జన నాయగన్... భగవంత్ కేసరికి కాపీయా?



విజయ్కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'జన నాయగన్' తెలుగులో జన నాయకుడు సంక్రాంతి కానుకగా జనవరి 9న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పుడు దీని విడుదలకు ముందు బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్ వన్‌లోకి వచ్చింది. 'జన నాయగన్' బాలకృష్ణ 'భగవంత్ కేసరి'కి రీమేక్ అంటూ ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఈ రెండు సినిమాల దర్శకులు స్పందించినప్పటికీ వీటికి చెక్ పడలేదు. మరికొన్ని రోజుల్లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పుడు అందరూ 'భగవంత్ కేసరి'ని చూసేస్తున్నారు. దీంతో అమెజాన్ ప్రైమ్‌లో ఉన్న ఆ చిత్రం రెండేళ్ల తర్వాత ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్1లోకి వచ్చేసింది. ఈ రీమేక్ వార్త ప్రచారం జరుగుతుండడంతో దర్శకుడు హెచ్.వినోద్ ఇటీవల స్పందించారు. 'నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు' అని అన్నారు. అలాగే 'భగవంత్ కేసరి' తెరకెక్కించిన అనిల్ రావిపూడి కూడా ఈ ప్రచారంపై మాట్లాడారు. 'విజయ్‌ను నేను రెండు, మూడుసార్లు కలిశాను. మేము చాలా విషయాలు మాట్లాడుకున్నాం. 'జన నాయకుడు' కథ ఏంటనేది ఆ సినిమా విడుదలైన తర్వాతే మీకు అర్థమవుతుంది' అని చెప్పారు. ఇక విజయ్ చివరి సినిమా కావడంతో దీనిపై అందరిలో ఆసక్తి నెలకొంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా సిద్ధమవుతోన్న ఈ మూవీలో విజయ్ సరసన పూజాహెగ్డే కథానాయికగా కనిపించనున్నారు.

## స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

### రాజాసాబ్ సినిమాపై మాళవికా మోహనన్

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం ముద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

### లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్



టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

# ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

## ఎస్టీయూ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**నేటిసాక్ష, కరీంనగర్:** ఎస్టీయూ 2026 డైరీని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత 80 ఏళ్లుగా ఎస్టీయూ కృషి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షులు దాసరి సుభాష్, నాయకులు నారాయణస్వామి, దేవేందర్‌రావు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## ఫార్మసీ కాలేజికి బస్సు నడపాలి



**నేటిసాక్ష, కరీంనగర్:** కరీంనగర్ బస్టాండు నుంచి ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా శాతవాహన ప్రభుత్వ ఫార్మసీ కళాశాల వరకు బస్సును నడిపించాలని ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సును నడిపిస్తే ఫార్మసీ కళాశాల, ఐటీఐ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, క్రీడా పాఠశాల, గురుకుల పాఠశాల, ఐటీ హబ్‌కు వెళ్ళే వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు.

## రాయలసీమ ముద్దు





**పాములపాడు నేటి సాక్ష:**
రాయలసీమ గుండెల్లో పుట్టిన
ఓ ఉద్యమ జ్వాల మీ అడుగుల్లో వెలిగింది,
న్యాయం కోసం నడిచే బాటలో
మీ మాటే మంత్రంగా మారింది.

తండ్రి ఆశయాల నీడలో
సేవనే శ్వాసగా తీసుకొని,
ప్రజల గళంగా పార్లమెంట్‌లో
ధైర్యంగా స్వరం ఎత్తిన శక్తి నీవే.

నిశ్శబ్దానికి స్వరం ఇచ్చిన నడక మీది,
నంద్యాల గుండెల్లో నమ్మకపు వెలుగు మీది.
అడుగడుగునా ప్రజల బరువు మోస్తూ,
అక్కగా, నాయకురాలిగా నిలిచిన త్యాగం మీది.

సభలో గర్జించే ధైర్యం మీ మాటలో,
సేవలో కరిగిపోయే సౌమ్యత మీ చేతిలో.
డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా దిశ చూపిస్తూ,
స్త్రీ శక్తికి అర్థం చెబుతున్న శిఖరం మీరు.

పేదల కన్నీటిని అక్షరాలుగా మలిచి,
హక్కుల కోసం ప్రశ్నించే ధైర్యాన్ని పెంచి,
ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తూ,
నీతికి నిలువెత్తు రూపమయ్యావు అక్కా.

ఈ జన్మదినం నీకే కాదు ఉ ప్రజలకే పండుగ,
నీ ఆయుష్షు దేశానికి ఓ అపూర్వ వరం.
ఆరోగ్యం, శక్తి, విజయాలు మీ వెంట నడవాలి,
శబరి అక్క ఉ మీ సేవ యుగయుగాలు నిలవాలి.

ప్రజల హృదయాల్లో నిలిచే నాయకురాలైన
మా అక్క డా. బైరెడ్డి శబరి అక్కకి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

# బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు

- డైనమిక్ లీడర్‌కు ఘన నివాళిగా కేక్ కటింగ్ కార్యక్రమం



**నేటి సాక్ష, పాములపాడు:** నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, డైనమిక్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలను పాములపాడు మండలం లింగాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లింగాల నవీన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు, నందికొట్కూరు నియోజవర్గ యువ నాయకుడు కురువ రమేష్ హాజరయ్యారు. బైరెడ్డి అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ ఆనందంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో చిన్నారులు కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు కురువ రమేష్ మాట్లాడుతూ "మన రాయలసీమ పులి, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి గారి వారసురాలిగా, తండ్రిలోని మంచితనాన్ని పునికిపుచ్చుకొని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా నిలుస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆమె మరెన్నో పుట్టినరోజులు జరుపుకొని, గొప్ప గొప్ప పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. అదేవిధంగా లింగాల నవీన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ "ప్రజాసేవ ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మరెన్నో విజయాలు సాధించాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం, ప్రజల ప్రేమ ఎల్లప్పుడూ ఆమె వెంట ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, టెలికాం సలహా కమిటీ సభ్యులు కురువ రమేష్, దేగల లోకేష్, రామ్మూర్తి యాదవ్, చిన్న అంబయ్య, అమృత, శివ భాస్కర్, గంట వెంకటేశ్, విశ్వేశ్వర బాబు, మల్లితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు అండగా ఎర్రజెండా..



- ఖమ్మం లో సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి..
- జిల్లా కార్యవర్గ సభ్యులు సిపిఐ యం. రమేష్...
- బాబు హెచ్చరిక......

**నేటి సాక్ష పాములపాడు :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం నగరంలో జనవరి 18న జరిగే లక్షలాదిమంది బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.. రమేష్ బాబు తాలూకా కార్యదర్శి టి ప్రతాపులు పిలుపునిచ్చారు.. ఆదివారం బానకచర్ల గ్రామ శాఖ సమావేశం నాగేంద్ర అధ్యక్షతన జరిగింది ముందుగా శాఖ కార్యదర్శి ఏసేపు జండావిష్కరణ చేశారు. అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న రమేష్ బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అనేకమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఏర్పడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అనేక పోరాటాలు త్యాగాలు నిర్బంధాలు ఎదుర్కొని బ్రిటిష్ వారిని ఈ దేశం నుంచి తరిమికొట్టిన చరిత్ర ఒక సీపీఐకే ఉందన్నారు. నుండి నేటి వరకు పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా తెలంగాణ సాయుధ పోరాటంలో లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సిపిఐదేరన్నారు.. వంద సంవత్సరాలుగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పేదలకు కూడుగూడు విద్య వైద్యం అందాలని అనేక పోరాటాలు నిర్వహిస్తూ నేడు అశేష త్యాగాలతో ఖమ్మంలో లక్షలాదిమంది పాల్గొనే బహిరంగ సభ జరుగుతుందని అందులో ప్రపంచ దేశాల నుండి ప్రతినిధులు పాల్గొంటున్నారని ఈ బహిరంగ సభ విజయవంతం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో శాఖ సమితి సభ్యులు పాల్గొన్నారు..

# చెరువులో స్మశానమా సిగ్గుచేటు..

- స్థలం కేటాయించకపోతే ఆందోళన తప్పదు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.. రమేష్ బాబు హెచ్చరిక.





**నేటి సాక్ష జూపాడుబంగ్లా :** రాయలసీమ తలమానికంగా జరిగే శ్రీ రంగనాథ స్వామి జాతర జరిగే గ్రామమైన తర్తూరులో ఇంత వరకు దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన 250 కుటుంబాలకు స్మశాన వాటిక లేని పరిస్థితి ఉందని చెరువులో స్మశానం ఉండడం అధికారులకు తగునా అని ఈ సమస్య అధికారులకు కనిపించడం లేదా అని తక్షణమే స్మశానానికి స్థలం కేటాయించకపోతే ఆందోళన తప్పదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు..ఆదివారం తర్తురు గ్రామ ప్రజలతో కలిసి చెరువును తలపిస్తున్న స్మశానాన్ని పరిశీలించడం జరిగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు గ్రామాల్లో స్మశాన వాటికలు లేని పరిస్థితి ఉందన్నారు. ప్రచారాలకు మాత్రమే పరిమితమైన అధికారులు స్మశాన వాటికలకు స్థలాలు ఎందుకు కేటాయించడం లేదని,అక్రమంగా స్థలాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోకుండా గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు విచ్చలవిడిగా దోపిడీ జరుగుతున్న పట్టించుకోవడంలేదని ముఖ్యంగా తర్తురు,, పారుమంచాల గ్రామాల్లో స్మశాన వాటిక లేక గ్రామ ప్రజలు అల్లాడే పరిస్థితి నెలకొందన్నారు.. స్మశాన వాటికలకై సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు పిజిఆర్ఎస్లో దరఖాస్తు చేసిన దృష్టి కేంద్రీకరించడంలో అధికారులు విఫలం చెందుతున్నారన్నారు. గ్రామాల్లో పరిపాలించే నాయకులకు సంబంధించిన స్మశాన వాటిక స్థలాలు ఎలా ఉన్నాయి,దళిత బిసి ల స్మశాన వాటికలు ఎలా ఉన్నాయో పరిశీలన చేయాలన్నారు.. గ్రామాల్లో తారతమ్య బేధాలు లేకుండా అందరికీ స్మశానవాటికలు సమానంగా కేటాయించాలన్నారు.. రెవెన్యూ, అభివృద్ధి,సాంఘిక సంక్షమ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని లేనిపక్షంలో తమ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు..త్వరలో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు భాషా సలీం,తర్తూరు గ్రామస్తులు డ్రైవర్ రంగస్వామి, మంగలి నాగేంద్ర,రవి,తెలుగు వెంకటేశ్వర్లు, గని, మధు, కురువ శేషన్న,తదితరులు పాల్గొన్నారు..

# జనసేన పార్టీ లో చేరిన మంతెన సంపత్



**నేటి సాక్ష :** కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి 35.19 కోట్ల శంకుస్థాపన కార్యక్రమనికి వచ్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెన్నూర్ నియోజకవర్గం నుండి తెలంగాణా రాష్ట్ర నాయకులు సిద్దు తన కార్యకర్తల తో భారీగా తరలీ వెళ్లడం జరిగిందన్నారు, 2009 లో చెన్నూర్ నియోజకవర్గం లో ప్రజారాజ్యం పార్టీ కొరకు పనిచేసినా మంతెన సంపత్ చెన్నూర్ లోకల్ అభ్యర్థి ని తెలంగాణ జనసేన పార్టీలోకి ఆహ్వానించి వారిని చెన్నూర్ జనసేన పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందన్నారు, తెలంగాణ రాష్ట్ర నాయకులు సిద్దు మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో పార్టీ ఎదుగుదల కొరకు ప్రజా సమస్యల పై రాజీలేని పోరాటం చేయడానికి సంపత్ తమ ముందు ఉంటారని వారిని దృష్టిలో ఉంచుకొని వారిని పార్టీ లోకి తీస్తుళ్లానని ప్రజా రాజ్యం పార్టీలో నాతో కలిసి పనిచేసారు అని అయన మీద నమ్మకం తోనే ఆయనని ఆహ్వానించమన్నారు. సిద్దు నా మాటని గౌరవించి మంతెన సంపత్‌ని పవన్ కళ్యాణ్ సమక్షంలో చేర్చుకున్నశీదుకు అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి జనసేన పార్టీ వైస్ ప్రసిడెంట్, టీటీడీ బోర్డు మెంబెర్ మహేందర్ రెడ్డి ని తెలంగాణా రాష్ట్ర ఇంచార్జ్. హియత్ నగర్ టీటీడీ ఎల్ఏసీ చైర్మన్ నేమురి శంకర్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపిన సిద్దు,జనసేన పార్టీ లోకి కళ్యాణ్ సమక్షంలో జాయిన్ చేయడానికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర నాయకులు సిద్దు కు మంతెన సంపత్ కృతజ్ఞతలు తెలియజేసారు

# వీర్‌పాల్‌కు ఘన సన్మానం

- కుమ్మర సంఘం పెద్దలు, శాలివాహన యూత్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**నేటి సాక్ష, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మ్యాడారం వీర్‌పాల్‌కు గ్రామ కుమ్మర సంఘం, శాలివాహన యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీర్‌పాల్‌తో పాటు ఉపసర్పంచ్ అరిగే రవికుమార్, 12వ వార్డు సభ్యురాలు అరుగుల వెంకటమ్మ, 13వ వార్డు సభ్యుడు లింగాల తిరుపతిలను శాలువాలతో సత్కరించి ఘనంగా అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీర్‌పాల్ మాట్లాడుతూ, సంఘం సంక్షమం, గ్రామాభివృద్ధి పరంగా తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గ్రామ ప్రజలు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా, పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యాభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమన్వయంతో పనిచేస్తూ నందిమేడారం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తన బాధ్యత అని ఆయన తెలిపారు. యువత భాగస్వామ్యంతో గ్రామానికి మంచి భవిష్యత్తును అందించేందుకు కృషి చేస్తానని, విద్య, ఉపాధి అవకాశాలపై యువతను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. గ్రామంలో సామాజిక ఐక్యత, శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం పెద్దలు ఆవునూరి ఎల్లయ్య, గంగయ్య, అంజయ్య, యూత్ అధ్యక్షుడు ఆవునూరి కిరణ్, ఉపాధ్యక్షుడు అంజి, సభ్యులు ఆవునూరి రవీందర్, ప్రశాంత్, అజయ్, అనిల్, మనోహర్, శ్రీకాంత్, మహేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలి



- కొండ గ్రామంలో వాలీబాల్ క్రీడలు ప్రారంభం....
- పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి....

**నేటి సాక్ష (రిపోర్టర్ ఇమామ్ సాబ్):** గ్రామీణ ప్రాంతాల్లో గల విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ .సూర్య మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు మరికల్ మండల పరిధిలోని రాకుండ గ్రామంలో విద్యార్థులకు వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గల విద్యార్థిని విద్యార్థులు చదువులో క్రీడల్లో తమ ప్రతిభను చాటి గ్రామ స్థాయిలో జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో తమ గుర్తింపును కనబరచాలని ఆయన కోరారు. రాకుండ గ్రామానికి క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు త్వరలోనే క్రికెట్ కిట్టు ఇవ్వడానికి ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మరికల్ ఎస్సై రాములు, రాకుండా గ్రామ సర్పంచ్ గాదం పెద్ద పుల్లయ్య, ఉప సర్పంచ్ నరేష్ రెడ్డి, క్రీడల నిర్వాహకులు జీవరత్నం, మరికల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, మరికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్, గ్రామం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, పిటిఈ శ్రీనివాసులు, ఆంజనేయులు రాములు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పడం మీ ప్రభుత్వానికి అలవాటే



- చంద్రబాబు మాటలెపుడు నీటి మూటలే అని మరోసారి రుజువు
- మంచి ప్రభుత్వం అని మీకు మీరే చెప్పుకోవడం కాదు ప్రజలు చెప్పాలి
- డాక్టర్ కోలారు వెంకట ప్రకాష్

**నేటి సాక్ష తిరుపతి, వెదురు కుప్పం:** తుడా పరిధిలోకి వెదురుకుప్పం కార్వేటినగరం మండలాలను చేర్చిన ఘనత వైస్సార్సీపీ ప్రభుత్వానిదే ...మాట చెప్పడం మాట తప్పడం మా అధినేత జగన్మోహన్ రెడ్డికి కానీ మా ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామికి కానీ తెలియదు. .ఉపముఖ్యమంత్రిగా నారాయణ స్వామి ప్రత్యేక ద్రుష్టి వల్లనే ఆ రోజు కర్వేటీనగరం వెదురు కుప్పం మండలాలను తుడా పరిధిలోకి చేర్చారు, అదే కర్వేటీనగరానికి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా 50 పడకల ఆసుపత్రిగా మార్చి ప్రజలకు మరింత చేరువ చేసారని నియోజకవర్గం వైద్య విభాగ అధ్యక్షుడు డాక్టర్ కోలారు వెంకట ప్రకాష్ తెలిపారు కంటి తుడుపు చర్యగా నిరసనలు తెలియచేయడం ప్రజలను మభ్యపెట్టడానికేనా? బిమీ వల్ల ప్రజలకు మేలు జరిగితే సంతోషమేనన్నారుయువగలం పాదయాత్రలో మీ మంత్రి నారాలోకేష్ మాటిచ్చిన మాట వాస్తవం కాదా. అప్పటి మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బాదుడే భాధుడు అని ఒక కార్యక్రమాన్ని పెట్టి అందులో కర్వేటినగరం నడిబొడ్డున శ్రీ వేణుగోపాల స్వామి సాక్షగా చెప్పిన మాట వాస్తవం కాదా? మరి సాక్షత్తు ఒక ముఖ్యమంత్రిగారి మాటే నీటి మూటలైతే చెప్పినది చేయక పోగా మాది మంచి ప్రభుత్వం అని మీరెలా అనగలుగుతున్నారు. .మా ప్రభుత్వం లో మీరు మూడు పర్యాయాలు చేయలేని అభివృద్ధి మేము చేసి చూపించ్చాం. కానీ మీరు ఇప్పుడు చేయలేక గత వైస్సార్సీపీ ప్రభుత్వాన్ని మాట్లాడటం సరికాదు. .కొత్త జిల్లాలను ఏర్పాటు చేయగలిగిన వారు కనీసం తుడపరిధి లోని మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపలేరా. వెదురుకుప్పం కర్వేటీనగరం రెండు మండలలాను తిరుపతిలో కలపడాన్ని మేము హర్షిస్తాము. .. .మా విన్నపం ఏంటంటే మీరు చెప్పిన మాటని ఈ ఒక్కసారైనా తలుచుకొని మా ప్రజల అభీష్టం మేరకు ఆ మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరుకుంటామన్నారు

# పరిష్కార వేదికకు 35 వినతులు

- క్షత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించండి.
- కమిషనర్ ఎన్. మౌర్య.



**నేటి సాక్ష తిరుపతి:** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ కమిషనర్ ను కోరారు. కాగా మధురా నగర్ నందు రోడ్డు గుంతలు ఉండడంతో ఆక్రమణకు గురవుతున్నదని, రోడ్డు వేయాలని, మునిసిపల్ స్కూల్స్ లో పనిచేస్తున్న కంటింజెన్సీ వర్కర్స్ కు జీతాలు పెంచాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, భవాని నగర్ నందు పగిలిపోయిన డ్రైనేజి పైప్ లైన్ మరమ్మతులు చేయాలని, రవీంద్ర నగర్ లో యూడీఎస్, త్రాగునీటి పైప్ లైన్ వసతి కల్పించాలని,. బి. లేఔట్ నందు మ్యాన్ హౌల్ సమస్య పరిష్కరించాలని, చెన్నారెడ్డి కాలనీ పంచాయతీ కార్యాలయం వద్ద చెట్టు కొమ్మలు తొలగించాలని, బస్టాండ్ సమీపంలోని రిలయన్స్ ఎదురుగా ఇన్న రోడ్డులో గుంతలు పూడ్చాలని, లక్ష్మీపురం కూడలి వద్ద సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని, కరకంబాడీ – లీలా మహల్ డెడ్ ఎండ్ వద్ద గరుడవారధి లీక్ అవుతున్నది అరికట్టాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్,డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## ప్రతి రైతుకు యూరియాను అందిస్తాం

తీలేరు సింగల్ విండో ద్వారా రైతులకు యూరియా.....

మరికల్ మండలం వ్యవసాయశాఖ అధికారి మహమ్మద్ రహిమాన్..



**నేటి సాక్ష, (రిపోర్టర్ ఇమామ్‌సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయం చేసుకునే ప్రతి రైతుకు ప్రభుత్వం ద్వారా యూరియాను అందిస్తామని మరికల్ మండల వ్యవసాయ శాఖ అధికారి మహమ్మద్ రహమాన్ అన్నారు. సోమవారం నాడు తీలేరు సింగల్ విండో కార్యాలయం ద్వారా మరికల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు యూనియన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో నాలుగు లారీల యూరియా మండలానికి త్వరలోనే రాబోతున్నదని ఆయన వివరించారు. రైతులకు యూరియా లోటు లేదన్నారు. ప్రస్తుతం తీలేరు సింగల్ విండోలో 900 బస్తాలు అందుబాటులో ఉందన్నారు. వీటిని కూడా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఒక యూరియా బస్తా రూ, 2 61 అన్నారు. మరికల్ మండల రైతులు సింగల్ విందు ద్వారా యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో తీలేరు సింగల్ విండో కార్యాలయం సిబ్బంది కృష్ణ, శ్రీలత, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యాలయం పరిశీలన

రాకుండ గ్రామ సర్పంచ్ పుల్లయ్య...



**నేటి సాక్ష,(రిపోర్టర్ ఇమావ్ం సాబ్):**నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని రా కొండ గ్రామంలో గల ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాన్ని రాకుండా గ్రామ సర్పంచ్ పుల్లయ్య సోమవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం శిథిల వ్యవస్థలో చేరుకున్నదని, బీటులు వారిందని ఆయన వివరించారు. అంగన్వాడి కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రాకుండా గ్రామంలో స్థలం అంగన్వాడి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థలంను చూపిస్తామని ఆయన వివరించారు. పేట జిల్లా అధికారులు స్పందించి రాకుండ గ్రామానికి అంగన్వాడి నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఆయన కోరారు.

## జయకృష్ణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**నేటి సాక్ష తిరుపతి:** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం రెవెన్యూ అధికారిని సోమవారం అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ బహుజన సంఘం నాయకులు చలపతి, గాలి రవి, సుబ్బరామయ్య,రామ్మూర్తి రెడ్డి, నల్లన్న, రమేష్, రాజశేఖర్, మునికుమార్, మురళి, శ్రీహరి, గురుమూర్తి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## యూనిఫాంల పంపిణీ



**నేటి సాక్ష,(రిపోర్టర్ ఇమావ్ం సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ప్రభుత్వ అంగన్వాడి చిన్నారులకు యూనిఫామ్ లను మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, ఉప సర్పంచ్ కటికే కాజా ల ఆధ్వర్యంలో సోమవారం నాడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సరోజినీ, మరికల్ మండల అంగన్వాడి సూపర్వైజర్ మహేశ్వరి, మరికల్ గ్రామ వార్డు సభ్యులు,, అంగన్వాడి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులన అరెస్ట్



**నేటి సాక్ష తిరుపతి:** రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ తిరుపతి కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జ్ భూమన అభినయ్ రెడ్డి తోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులని కార్యకర్తలని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హుటాహుటిన తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, శాంతియుత ప్రజాస్వామ్య నిరసనపై పోలీసుల అణచివేత చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొంటూ, వెంటనే అభినయ్ రెడ్డిని విడుదల చేయాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పాఠశాలల సమస్యలపై సర్పంచ్ పరిశీలన

**నేటి సాక్ష, కొమురం భీం ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ జిల్లా నంబాల మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రూప), మన్నెగూడెం ప్రాథమిక పాఠశాలలను సర్పంచ్ లక్ష్మ నీలయ్య గారు శుక్రవారం సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు సమస్యలను సర్పంచ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను వివరించారు. స్కూల్ ఇన్ టైమ్, ఔట్ టైమ్‌కు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలో తాగునీటి సదుపాయం, మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంటగది (మిడ్ డే మీల్ షెడ్) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై స్పందించిన సర్పంచ్ లక్ష్మ నీలయ్య గారు, జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే అతి త్వరలోనే వంట షెడ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చీ=జు+టా టెక్నికల్ అసిస్టెంట్‌ను పిలిపించి చర్చించారు. పాఠశాలలో అవసరమైన చిన్నచిన్న మరమ్మత్తులపై హెడ్‌మాస్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్‌కు సూచించారు. అలాగే 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాల సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్పంచ్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాగిడి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ ఏ మాజీ వీర్‌ాజ కొప్పుల శ్రీనివాస్, వార్డు సభ్యులు బక్క ఆనంద్, ఇప్ప వెంకటి, గ్రామపెద్దలు సిద్దెంకి సత్తయ్య, రాంటెంకి శ్రీనివాస్, ముదం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత అవగాహన సదస్సు




**నేటి సాక్ష (పూరెళ్ల బాపు):** జగిత్యాల ఋూ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్లెట్ హై స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిటీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులారా, ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో విద్యార్థులు కూడా బాధితులవడం ఎంతో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం, రోడ్డు దాటేటప్పుడు నిర్లక్ష్యం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. మీ జీవితం అమూల్యమైనది. మీరు దేశ భవిష్యత్తు. కాబట్టి రోడ్డు ఉపయోగించే సమయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ తప్పనిసరిగా ఉపయోగించాలి, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి, ఎడమ వైపు నడవాలి. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. ఒక చిన్న నిర్లక్ష్యం మీ జీవితాన్ని శాశ్వతంగా మార్చగలదు. రోడ్డు భద్రతను మీ జీవితంలో భాగంగా చేసుకొని, మీ కుటుంబానికి మరియు సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. జగిత్యాల జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా మార్చేందుకు మనమందరం కలిసి కృషి చేద్దాం. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ, మీరు కూడా రోడ్డు భద్రత దూతలుగా మారాలని అన్నారు.

# బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## వాట్సాప్ అపరిచిత లింకులతో మోసపోవద్దు



నేటి సాక్ష (బుర్ర అంజయ్య గౌడ్): గన్నేరువరం మండల కేంద్రంలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్లో సోమవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గన్నేరువరం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు సేవలపై కళాజాత బృందం తో అవగాహన ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ భూక్య నరేష్ మాట్లాడుతూ పొదుపు ప్రతి ఖాతాదారుడు అలవాటు చేసుకోవాలన్నారు స్మార్ట్ ఫోన్లతో జాగ్రత్తగా ఉండాలని వాట్సాప్‌లో వచ్చే అపరిచిత లింకులను ఓపెన్ చేయొద్దు అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామంచ స్వామి పద్మశాలి సంఘం అధ్యక్షుడు తేల రవీందర్ గౌరవ అధ్యక్షులు తేల చంద్రశేఖర్ వార్డు సభ్యులు వెదిరే విజయేందర్ మచ్చ బాలరాజ్ బూర రామకృష్ణ సబ్బన్ మహేష్ తేల సుధాకర్ లక్ష్మణ్ వేముల రవి ప్రసాద్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేవు

## పెన్షన్ బకాయిల సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి



**నేటి సాక్ష (పూరెళ్ల బాపు):** రిటైర్మెంట్ అయినప్పటికీ నెలలు గడుస్తున్నా పెన్షన్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం దారుణమని పెన్షన్ బకాయిల సాధన కమిటీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి విమర్శించారు. రిటైర్మెంట్ పెన్షన్ బకాయిల సాధన కోసం సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం కొరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పెన్షన్ దారులు వెళ్లేందుకు సిద్ధమైన సందర్భంలో జగిత్యాల జిల్లా పెన్షన్ బకాయిల సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం రామ్ రెడ్డిని జగిత్యాల పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని సోమవారం వదిలిపెట్టారు.

## ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ

ఉద్యమాన్ని అణచివేసే భాగంలో పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్లోనే ఉంచడం విచారకరమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, దీన్ని తీవ్రమైన చర్యగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఒకవైపు మాకు రావాల్సిన డబ్బులను 40 సంవత్సరాల కాలం సర్వీస్ చేసి దాచుకున్నావేనని, ఆ డబ్బులు ఇవ్వక పోవడంతో ఇప్పటికే దాదాపు 40 మంది పెన్షనర్లు చనిపోవడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించకుండా మానసిక ఒత్తిడికి గురవుతున్నామని చెబుతూ ఇది ఇలాగే కొనసాగితే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకొక తప్పదని రాంరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అరెస్టులను పెన్షనర్ల సంఘం రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించిందని, సర్వీస్ లో ఉన్న ఉద్యోగ సంఘాల నాయకులు సైతం ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించాలని ఆయన తెలిపారు.

# పంటలపై రైతు అవగాహన సదస్సు

**నేటి సాక్ష, నల్లబెల్లి జనవరి 05 :** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు కార్యక్రమం నల్లబెల్లి మండలం, కొండలపల్లి గ్రామంలో మిరప, ఉద్యానవన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ రీసర్చ్ సెంటర్ మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ, నల్ల తామర పురుగు, పచ్చదోమ, తెల్లదోమ, వైరస్ల నివారణపై సూచనలు అందించారు. ఎకరాకు 30–40 పసుపు అట్టలు, జిగురు పూసిన నీలి అట్టలు వేయాలని, కానుగనూనె, వేపనూనెలు వాడాలని చెప్పారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి రజిత మాట్లాడుతూ, ఉద్యాన పంటలు లాభదాయకమని, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వేస్తే ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఆయిల్ పామ్‌లో నీటి, ఎరువుల యాజమాన్యం, గెలలు కోతపై మార్గదర్శకత్వం. గ్రోమోర్ ఏరియా మేనేజర్ బోరాన్, మెగ్నీషియం పట్టికేసన్‌లో వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానాధికారి అల్లకొండ జ్యోతి, విస్తరణాధికారి త్రివేణి, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ కరుణాకర్ రైతులు కోలగాని రామారావు, లింగారెడ్డి, వీరారెడ్డి, పెద్దలకొమరారెడ్డి, అనుముల లింగారెడ్డి తదితరులు హాజరయ్యారు.




# సంక్షమ పథకాలు అమలు చేయాలి

- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి
- ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో అలసత్వం వద్దు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఓసి జేఏసీ నాయకుల వినతి




**నేటి సాక్ష (పూరెళ్ల బాపు):** అగ్రవర్ణాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ప్రభుత్వ సంక్షమ పథకాలు వర్తింపజేయాలని ఓసి జేఏసీ (రాజ జీరాజ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు ప్రజావాణి కార్యక్రమంలో ఓసి జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఓసి వర్గాలకు సంబంధించిన పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈ నెల 11న వరంగల్‌లో నిర్వహించనున్న ఓసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు జగిత్యాల వైశ్య భవన్‌లో ఓసి నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించి, అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓసి జేఏసీ నాయకులు ఎన్నం కిషన్ రెడ్డి, అయిల్నేని సాగర్ రావు, మహంకాళి రాజన్న, సిరిసిల్ల రాజేందర్ శర్మలు మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓసి కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే ఓసి వర్గాలకు జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, జనరల్ స్థానాల్లో ఓసి అభ్యర్థులే పోటీ చేసేలా రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఓసి వర్గాల్లోని ప్రతి విద్యార్థికి విద్య, ఉద్యోగాల్లో ఉపయోగపడేలా జారీ చేయాలని తెలిపారు. ఓసి వర్గాలకు కేటాయించిన 10 శాతం ఉద్యోగాల్లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ, నిబంధనల మేరకు వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో నాయకులు దేవరశెట్టి జనార్దన్, మోతే ఉమాపతి శర్మ, ప్రసాద్ రావు, బండపల్లి చంద్రశేఖర్, రేణికుంట శ్రీనివాస్, అన్నపల్లి కాశీనాథం, అయిల్నేని స్వప్న, వెంకటేశ్వర్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

- నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి

**నేటి సాక్ష తిరుపతి:** పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని సర్పంచ్ గణపతి రెడ్డి డిమాండ్ చేశారు సోమవారం నడవలూరులో జరిగిన వికసిత్ భారత్ జి రాంజీ కృష్ణ మందిర్‌లో జరిగింది ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుమలత పంచాయతీలో జరిగిన పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు ఈ సందర్భంగా సర్పంచ్ నడవలూరు గణపతి రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులు, మంచినీటి పంపుల మరమ్మత్తు ఉంటే పనులను చేపట్టినా రాజకీయ ఒత్తిళ్లతో తమకు బిల్లులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆయన వాపోయారు తాను ఎన్నో కష్టనష్టాలను భరించి గ్రామ అభివృద్ధి కోసం సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టిన ఖర్చుపెట్టి బిల్లులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు పారిశుద్ధ పనులు చేపట్టనాని సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టిన గ్రామ అభివృద్ధి కోసం సొంత నిధులతో అనేక అభివృద్ధిని చేపట్టమని, స్థానిక సర్పంచ్‌గా ఉన్న నన్ను సంప్రదించకుండా గ్రామ కార్యదర్శి సుమలత స్వంత నిర్ణయాలు తీసుకోవడం, అదేవిధంగా బిల్లుల విషయంలో రాజకీయ జోక్యంతో నిలుపుదల చేయడం చాలా విచారకరమైన చర్యని ఆయన వాపోయారు గ్రామస్తులు గ్రామ సభలో అధికారులను నిలదీస్తూ వీధి దీపాలు వెలగడం లేదని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని నిలదీశారు తూతూ మంత్రంగా గ్రామంలో తాగునీటి సమస్యలు, మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికమైందని గతంలో కూడా గ్రామంలో విషజ్వరాల భారీనపడి ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవడం జరిగిందని ఆ సమస్యలను దృష్టిలోకి తీసుకోకపోవడం ఆమె పనితీరుకు నిదర్శనమన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు



# పోలీస్‌తో సమీక్ష సమావేశం





- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి ఉ ఎస్పీ స్నేహ మెహ్రా

**నేటి సాక్ష, :** వికారాబాద్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు తదితర పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాల పరిస్థితి, కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులను ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా డీఎస్పీ, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షణ చేస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. కోర్టుల్లో కేసుల ప్రాసిక్యూషన్ బలంగా ఉండేలా సాక్ష్యధారాల సేకరణలో లోపాలు లేకుండా చూడాలని, ఛార్జ్‌షీట్లను గడువులోగా దాఖలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాల అమలులో ఎలాంటి రాజీ లేకుండా వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిరంతరం నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీటీవీ మైరాల ఏర్పాటు, నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని, మట్కా, జూదం, గంజాయి తదితర అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, అటువంటి చర్యల్లో పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో 5ఎ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, ప్రతి కేసు వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీవీలు) పెండింగ్ లేకుండా అమలు చేయాలని, కోర్టులతో సమన్వయం మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఫిర్యాదుదారులకు తక్షణ స్పందన అందించి పోలీసులపై నమ్మకం పెంపొందించాలని ఎస్పీ పేర్కొన్నారు. మహిళల భద్రత, పిల్లల రక్షణ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో అత్యంత సున్నితంగా, అదే సమయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రేవ్ కేసుల్లో పక్కా ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు.

### గుడ్ వర్క్ చేసిన అధికారులకు క్యాష్ రివార్డులు

గత నెలలో జిల్లాలో విశేష సేవలు అందించిన పోలీస్ అధికారులను ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించి క్యాష్ రివార్డులు అందజేశారు.

### రివార్డులు పొందినవారు:

ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘురాములు, పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది నరేష్, రామకృష్ణ, పాండురంగం, మున్నయ్య, దస్తప్ప, ప్రతాప్ సింగ్, జమీల్, అనిల్ కుమార్. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ వీరేష్, ఏఓ ఖాజా మొహినొద్దీన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సినీ పండుగ సంబరాలు

- ముందస్తు సంక్రాంతిగా మారిన బలిజపల్లి గ్రామం
- ప్రొడ్యూసర్ కొణిదల సుస్మిత, డైరెక్టర్ అనిల్ రావిపూడిలకు ఘన స్వాగతం
- కోడిగిత్తల అలంకరణ, గంగిరెద్దుల విన్యాసాలు, మహిళల ముగ్గులతో పల్లె పండుగ వైభవం
- వేడివేడి పిండివంటలు, గొబ్బిళ్లు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి



**నేటి సాక్ష, తిరుపతి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనవరి 12న విడుదల కానున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ట్రైలర్ విడుదల వేడుకలు తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం బలిజపల్లి గ్రామంలో అంబరాన్నంటాయి. గ్రామం మొత్తం ముందస్తు సంక్రాంతి సంబరాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆదివారం బలిజపల్లి గ్రామంలో నిర్వహించిన సినీ పండుగ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, ప్రొడ్యూసర్ కొణిదల సుస్మిత, గారపాటి సాహు, డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి విచ్చేసిన సినీ ప్రముఖులకు మెగాస్టార్ వీరాభిమాని పొర్లు దండాల ఈశ్వర్ రాయల్, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పగడాల మురళి, నార్ల చంద్రశేఖర్ రాయల్, తపసి మురళీ రెడ్డి, దండు లక్ష్మపతి, బలిజపల్లి యువత, మహిళలు, పరిసర గ్రామాల ప్రజలు భజభజంత్రీలు, డప్పులు, బాణాసంచాలు, వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అతిథులు గ్రామంలోని శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులను తిలకించారు. సంక్రాంతి పండుగకు ప్రతీకగా కట్టెల పొయ్యిపై తయారు చేసిన పిండివంటలను పరిశీలించి, వేడివేడి మురుకులు, అత్తిరసాలు రుచి చూశారు. మహిళల వంటల ప్రతిభకు మెచ్చి "శభాషు అంటూ అభినందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు సంకీర్తనలు, మహిళల గొబ్బిళ్లు, చెక్కభజనలు సినీ ప్రముఖులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా పశువుల ఊరేగింపులో భాగంగా కోడిగిత్తల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా పండుగ సభలో ప్రొడ్యూసర్ కొణిదల సుస్మిత మాట్లాడుతూ "మన అందరి అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా జనవరి 12న విడుదలవుతోంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి ఆదరించి, సూపర్ హిట్ చేయాలి" అని కోరారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ బలిజపల్లి గ్రామ ప్రజలు, యువత, మహిళలు ఎంతో ఆత్మీయంగా ముందస్తు సంక్రాంతి పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా 'మన శంకర వరప్రసాద్ సినిమా పండుగ సంబరాలు బలిజపల్లిలో ముందస్తు సంక్రాంతిగా మారి, గ్రామాన్ని ఉత్సాహంతో నింపాయి.

# గంగాపూర్ దేవాలయం ఏర్పాట్ల పరిశీలన



**నేటి సాక్ష:** కుమురం భీమ్ ఆసిఫాబాద్: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్, గారు రెబ్బెన మండలంలోని గంగాపూర్ దేవాలయాన్ని సందర్శించి, రానున్న జాతరను శాంతియుతంగా, సాఫీగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు దేవాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి, జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గుంపుల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలు, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, సున్నిత ప్రాంతాలలో తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీతో పాటు సంబంధిత ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని తెలిపారు.

జాతరను శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఎస్పీ నితికా పంత్ గారు తెలిపారు. పోలీసులకు సహకరించి, వారి సూచనలను పాటించడం ద్వారా జాతర విజయవంతానికి తోడ్పడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన కాలువకు గండి,

## సారంగాపూర్, బట్టపల్లి, పోతారం రైతుల్లో ఆందోళన



**నేటి సాక్ష (పూరెల్ల బాపు):** జిల్లాలోని సారంగాపూర్ మండలం బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాలకు సాగునీరు అందించే ప్రధాన కాలువకు గండి పడటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి డి-53 ద్వారా 12ఎల్ (సారంగాపూర్‌కు వచ్చే కాలువ) వైపు వచ్చే కాల్వలో గండిపడటంతో, ఆయా గ్రామాలకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు తెలిపారు. పంటల సాగు కీలక దశలో ఉన్న సమయంలో కాలువకు గండి పడటంతో నారుమడులు, పంట పొలాలు ఎండిపోతాయనే భయం నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీలపై ఖర్చు చేసినట్లు పేర్కొంటూ, తక్షణమే నీరు విడుదల చేయకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గండిని వెంటనే పూడ్చి, మరమ్మత్తులు చేపట్టి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్ఎస్పీ అధికారులను రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పంటలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా, నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఈ అంశంపై చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. చెరువును సందర్శించి, అధికారులను కలిసి రైతులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూడు గ్రామాలకు సంబంధించిన సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్థిక భద్రత కోసమే వికసిత్ భారత్



**నేటి సాక్ష న్యూస్ చౌడేపల్లి :** వికసిత్ భారత్ కార్యక్రమం జీరామ్‌జీ (వీబీ-జీరామ్‌జీ) ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, స్థిరమైన ఆస్తులను సృష్టించడానికి, రూపొందించిన చట్టమని ఇది మహాత్మా గాంధీ .జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)చట్టాన్ని స్థానంలో తీసుకువచ్చిన వికసిత్ భారత్ 2047 లక్ష్యనికి అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 19 గ్రామ పంచాయతీలందు గ్రామసభలను నిర్వహించారు, ఈ మేరకు ఉపాధి హామీలు జరుపబోయే కార్యక్రమాలను అధికారులు కూలీలకు గ్రామస్తులకు వివరించారు, ఆయా కార్యక్రమంలో సర్పంచులు వార్డు మెంబర్లు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

# భక్తి శ్రద్ధలతో శేష పూజలు



**నేటి సాక్ష న్యూస్:** చౌడేపల్లి పరిధిలోని చిన్న కొండా మరి సమీపంలో గల విశాలాక్ష సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ,ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు ఆలయంలో ఉదయాన్నే ప్రధానార్చకుల ఆధ్వర్యంలో .స్వామి అమ్మవార్లకు విజయ అభిషేకము అలంకరణ గావించారు, వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన పక్షలకు ఆలయ నిర్మాణకర్త మనోహర్ ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు, కాగా ఆలయంలో విద్యుత్ సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దారి సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు

# గ్రామ అభివృద్ధి... నా లక్ష్యం



**నేటి సాక్ష,నల్లబెల్లి:** చేతి పంపు పునరుద్ధరించిన సర్పంచ్ తీరిన కన్నరావుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తాగునీటి సమస్య. నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామ సర్పంచ్ పల్నాటి మూర్తి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో ఉన్న బోరింగ్‌ను రిపేర్ చేయించారు. గత కొన్ని సంవత్సరాలుగా పాడైపోయి పనిచేయని ఈ బోరింగ్ కారణంగా విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ పల్నాటి మూర్తి తక్షణమే స్పందించి మరమ్మతు పనులు చేపట్టించారు. రిపేర్ అనంతరం బోరింగ్ నుంచి నీరు సక్రమంగా రావడంతో పాఠశాల అవసరాలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ చర్యపై గ్రామస్థులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

## ప్రోషక ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన



**నేటి సాక్షి:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శేకల్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో సోవ-ంవారం రోజున అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు సాంప్రదాయ బద్ధంగా అన్న ప్రసన్న చేసి బాలామృతం కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్స రమేష్ ఉప సర్పంచ్ ,నార్ల బుచ్చయ్య,మరియు వార్డు మెంబర్లు ,తల్లులు, గ్రామ ప్రజలు ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు ,పల్లె దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితం

- మహా ప్రస్థానానికి మహాద్భుత రూపు
- శ్మశానవాటికలకు ఆధునిక హంగులు
- 22 శ్మశానవాటికల అభివృద్ధికి రూ.3.98 కోట్లు

అభివృద్ధి పనులకు ఉత్తర్వులు జారీ

**నేటి సాక్షి బాపట్ల జిల్లా:** పర్చూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజలకు అంత్యక్రియల సమయంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన నిరంతర కృషికి స్పష్టమైన ఫలితం దక్కింది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలో మొత్తం 22 శ్మశానవాటికల అభివృద్ధి పనుల కోసం రూ.3.98 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025, 26 ఆర్థిక సంవత్సరంలో ఈ పనులను పూర్తిగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని శ్మశానవాటికలు ఆధునిక సౌకర్యాలతో కొత్త రూపును సంతరించుకోనున్నాయి. సకలవసతులతో గ్రామస్థాయిలోనే మహా ప్రస్థానాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### నాణ్యతతో పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే ఏలూరి

గ్రామీణ ప్రాంతాల్లో అంత్యక్రియలకు కనీస సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి, ప్రయత్నాల ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయని అధికారులు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడడమే కాకుండా, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

శ్మశానవాటికల అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి పురోగతిని ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి నివేదించాలని ఎమ్మెల్యే ఏలూరి అధికారులను ఆదేశించారు.

మహాద్భుతంగా సౌకర్యాలూ

ఈ నిధులతో శ్మశానవాటికల్లో ప్రధానంగా
1. దహన వేదిక (దహనవాటిక యూనిట్)
2. ఓపెన్ వెయిటింగ్ హాల్
3. శౌచాలయాలు
4. స్నానాల గదులు
5. లాకర్ రూమ్
6. కర్మకాండ వేదిక
7. బయోఉఫెన్సింగ్ గేట్‌తో ప్రత్యక్ష కంచె
8. తాగునీటి సౌకర్యం
9. డ్రెయినేజీ వ్యవస్థ

వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

### మండలాల వారీగా నిధుల వివరాలు

కారంచేడు మండలం 1 పని : రూ.9.87 లక్షలు
మార్టూరు మండలం 21 పనులు : రూ.3.88 కోట్లు

### మార్టూరు మండలంలో పనుల వివరాలు

బొబ్బేపల్లి బీసీ శ్మశానవాటిక ఉ రూ.18.82 లక్షలు
బొల్లపల్లి ఓసీ ఉ రూ.1.71 లక్షలు
చిమ్మిరిబండ ఓసీ ఉ రూ.19.60 లక్షలు
దర్శి ఓసీ ఉ రూ.19.81 లక్షలు



దేగరముడి బీసీ కాలనీ ఉ రూ.19.60 లక్షలు
దేగరముడి బీసీ కాలనీ (మరొకటి) ఉ రూ.19.86 లక్షలు
ద్రోణదుల ఓసీ ఉ రూ.19.88 లక్షలు
వడ్డెర బీసీ ఉ రూ.19.88 లక్షలు
జొన్నతాలి హిందూ ఉ రూ.18.84 లక్షలు
కొనంకి ఓసీ ఉ రూ.19.88 లక్షలు
మార్టూరు బండి నాగేశ్వరావు కాలనీ రూ.15.70 లక్షలు
మార్టూరు హిందూ ఉ రూ.19.75 లక్షలు
నాగరాజుపల్లి హిందూ ఉ రూ.19.56 లక్షలు
రాజుగారిపాలెం ఓసీ ఉ రూ.19.73 లక్షలు
రాజుపాలెం బీసీ ఉ రెండు పనులు (రూ.18.95 లక్షలు చొప్పున) వలపర్ల మర్రిచెట్టు బీసీ ఉ రూ.19.51 లక్షలు వలపర్ల చెరువుకట్ట వడియారాజులు బీసీ ఉ రూ.19.51 లక్షలు వలపర్ల పంచాయతీ, ద్వారకాపాడు బీసీ ఉ రూ.19.51 లక్షలు అలాగే కారంచేడు గ్రామంలో ఓసీ, బీసీ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.9.87 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.

# గ్రామ పంచాయతీలలో ప్రధాని మోడీ ఫోటో

### ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు



**నేటి సాక్షి : నల్లబెల్లి :** ప్రతి గ్రామపంచాయతీలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నల్లబెల్లి బీజేపీ మండల అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సూపర్‌డెంట్ ఆబిద్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించే 14వ, 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారానే ప్రధానంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను ఎలా పెడుతున్నారో, అదే విధంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోను కూడా ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో మండల పార్టీ ఆధ్వర్యంలో తామే స్వయంగా ప్రతి గ్రామపంచాయతీలో ప్రధాని మోడీ ఫోటోను ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, జిల్లా నాయకులు బచ్చు వెంకటేశ్వర్ రావు, వల్లే పర్వతాలు, మండల నాయకులు మురికి మనోహర్, ఓదెల అశోక్, ఊటుకూరి చిరంజీవి, తిమ్మాపురం శివ, కొండ్లె రమేష్, గుండెబోయిన నవీన్, జన్ను మధు, ఈర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు పురస్కారాలు

### పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. సిస్టర్ జ్యోతి



**నేటి సాక్షి :** సిద్దిపేట జిల్లా స్థాయిలో లీడ్ లైఫ్ హ్యాపీలి Lead Life Happily నిర్వాహకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, డిజిటల్ ట్రాప్స్ అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో డాన్స్, స్కిట్ (డ్రామా), డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా మొత్తం 15 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో చేరియాల్ ప్రజెంటేషన్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ విశేష విజయాలు సాధించారు. డాన్స్ విభాగంలో ప్రథమ స్థానం, డ్రాయింగ్ విభాగంలో ద్వితీయ స్థానం, డ్రామా విభాగంలో తృతీయ స్థానం సాధించి బహుమతి నగదుతో పాటు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. సిస్టర్ జ్యోతి విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు బిక్షపతి విద్యార్థులను ముందుండి నడిపించారు.

# పార్టీకి అనుకూలంగా మున్సిపల్



**నేటి సాక్షి :** అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంటనే సస్పెండ్ చేయాలి. ఈరోజు చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉందని చెప్పి అన్ని రాజకీయ పార్టీలకు సర్క్యులర్ పంపినటువంటి మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది అది వాయిదా పడ్డ విషయం తెలియకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని సిపిఎం పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు అన్నారు ఈరోజు మున్సిపల్ ఆఫీస్ లో జరగాల్సిన సమావేశం వాయిదా పడ్డట్టుగానే సమయం పొడిగించినట్టుగానే రాజకీయ పార్టీల నాయకులకు చెప్పకపోవడం విడ్డూరమని కేవలం అధికార మరియు ప్రతిపక్ష పార్టీలకు చెప్పడం సరైన పద్ధతి కాదని వారితో సమావేశం నిర్వహించడం కరెక్ట్ కాదని సిపిఎం పార్టీ విమర్శించింది గత రెండు రోజుల కిందనే సిపిఎం పార్టీగా అన్ని వార్డులో సమానంగా ఓట్లను సరి చేయాల్సిందిగా ఒకే ఇంటి నెంబర్ పైన ఉండాల్సిన ఓట్లను చివరి పేజీలో రావడం ఇట్లాంటి కొన్ని సమస్యలను పరిష్కరించాల్సిందిగా సిపిఎం పార్టీ పట్ట కమిటీ ఆధ్వర్యంలో వివరణ సమర్పించడం జరిగింది ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సమాచారం అందించి సమావేశం నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముత్యాల ప్రభాకర్ ఎర్ర బోస్ అశోకు పోలోజు శ్రీహరి ఇప్పకాయల శోభ రాళ్ల బండి భాస్కర్ ఆముదాల నర్సిరెడ్డి బొంగుని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కారం



- ప్రతి మండలంలో ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ను ఏర్పాటు
- బాపట్ల జిల్లా ఆర్ డి ఓ గ్లోరియా

**నేటి సాక్షి బాపట్ల:** ప్రజల భూమి సమస్యలు, ఇతర రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ను ఏర్పాటు చేసిందని ఆర్ డి ఓ గ్లోరియా అన్నారు. కర్లపాలెం రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోరియా మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిస్కార వేదికలో ప్రజల నుండి భూమి తగాదాలు, పట్టా పుస్తకాలు, రీ సర్వే, ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు. అర్జీదారులకు కేవలం రసీదు ఇవ్వడమే కాకుండా, వారి సమస్యను ఎవరు, ఎప్పటిలోగా పరిష్కరిస్తారో తెలిపే కార్యాచరణ ప్రణాళికను తెలియజేస్తామని తెలిపారు. 4అర్జీలు వచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాకిర్ పాషా, సర్వేయర్ శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు

**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్):** గొల్లపల్లి గ్రామ ప్రజల అనారోగ్య సమస్యల చికిత్స నిమిత్తం గ్రామ సర్పంచ్, నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉపసర్పంచ్ గురజల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి గొల్లపల్లికి ఆరోగ్య రథన్ని గొల్లపల్లి మండల కేంద్రానికి ఏర్పాటు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యానికి గ్రామ ప్రజలు గొల్లపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఇట్టి అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకుని అనారోగ్య సమస్యలను చికిత్సలో పొందవలసిందిగా మనవి. నేడు గ్రామ ఉపసర్పంచ్ గురజల బుచ్చిరెడ్డి పచ్చజెండా ఊపి ఆరోగ్య రథన్ని గ్రామపంచాయతీ వద్ద ప్రారంభించడం జరిగింది ప్రతి సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు మండల కేంద్రానికి ఆరోగ్య రథం బస్సు వస్తుంది. ఆస్పత్రిలో చికిత్సలు పరీక్షలు నిర్వహించిన అనంతరం తిరిగి గ్రామంలో



దించుతారు కావున గ్రామ ప్రజలు ఇట్టి అవకాశాలు వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కళ్యాణ్ రాహుల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# వికసిత పంచాయితీలే లక్ష్యం




**నేటి సాక్షి తిరుపతి :** వికసిత భారత్, జీ రామ్ జీ పథకాలతో వికసిత పంచాయితీల లక్ష్యం నెరవేరుతుందని తెదాపా మండల అధ్యక్షులు మోహన్ మురళి అభిప్రాయ పడ్డారు. వెదురుకుప్పం గ్రామ పంచాయితీ సచివాలయంలో సోమవారం జరిగిన గ్రామ-సభలో అయన పాల్గొని ప్రసంగించారు. జంట పథకాలతో గ్రామ స్థాయిలో మెరుగైన ఉపాధి హామీ లభిస్తుందని చెప్పారు. 125 రోజుల పని కల్పనతో గ్రామీణ ప్రజలుకు ఆర్థిక స్వాలంబన చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ విప్ , శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థమస్ గారి సూచనలు మేరకు వికసిత్ భారత్ జి రామ్ జి పథకం, మరియు స్వచ్ఛ సంక్రాంతి సంబంధిత గ్రామసభ ఏర్పాటు చేయడం గ్రామాల్ని అభివృద్ధి బాటలో నడిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, సర్పంచ్ శిల్ప పంచాయతి కార్యదర్శి కోదండరెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ, విఆర్ఓ నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# వినతి పత్రం అందజేసినా సర్పంచ్



**నేటి సాక్ష:(గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ ప్రధాన సమస్యలైన బస్సు సౌకర్యం అంగన్వాడి భవనం గురించి మరియు స్కూల్ భవనం గురించి జగిత్యాల జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ ని కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది దీనికి అధికారులు సానుకూలంగా స్పందించడం జరిగింది మరియు అంగన్వాడి భవనం కూడా త్వరలోనే సాంక్షన్ చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల సౌందర్య సురేష్ ఉపసర్పంచ్ చెవుల తిరుపతి గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమిని కాపాడండి



**నేటి సాక్షి,తిరుపతి :** 'మా గ్రామంతో రూ.30కోట్లు విలువైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయడానికి అధికార పార్టీకి చెందిన కొదరు ఆక్రమణ దారులు పక్కాగా స్కెచ్ వేస్తున్నారని, వారి నుంచి ఆ విలువైన భూమిని కాపాడండి' అంటూ చిగురువాడకు చెందిన గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా చిగురువాడకు చెందిన 9వ వార్డు సభ్యులు ముచ్చేలి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంకు చేరుకుని డీఆర్ఓ నరసింహులుకు వినతి పత్రం అందించారు. ఆ తరువాత తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌ను కలసి వినతి పత్రం అందించారు. అలాగే తిరుపతి రూరల్ తహశీల్దారు వద్దకు వెళ్లిన ఆ ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులకు కట్టబెట్టాలని చూస్తే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఆ భూమిలో నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పలు మార్లు అర్జీలు ఇచ్చినా ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు అండగా నిలబడటంతో కోర్టుల చుట్టు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తు కలెక్టర్ ఆఫీసులో కొంత సమయం నిరసన తెలిపారు.

### కోర్టుల్లో కేసులున్నా.. లేక్క చేయరా..

చిగురువాడ ఉత్తరపు కండ్రిగ సర్వేనంబరు 382/2లోని 3ఎకరాల ప్రభుత్వ భూమిపై హైకోర్టులో రెండు కేసులు, లోకాయుక్తలో ఒక కేసు పెండింగ్‌లో వున్నప్పటికీ ఆక్రమణ దారులు ఆ భూమిలోకి ప్రవేశించాలని కుట్రలు చేస్తున్నారని,

- దొంగపట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- అధికారులకు ఫిర్యాదు చేసిన చిగురువాడ గ్రామస్తులు

అదే జరిగితే గ్రామం మొత్తం ఏకమై అడ్డుకుంటామని వెల్లడించారు. రెవెన్యూ అధికారులు కోర్టు కేసులను సైతం లెక్క చేయకుండా ముందుకు వెళుతున్నారని, వారందరినీ కోర్టు ముందు దోషులుగా నిలబెడతామన్నారు. కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించకుండా ప్రయివేటు వ్యక్తులు నకిలీ పట్టాలతో అమ్మేయాలని చూస్తే వారికి సహకరించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఉన్నత స్థాయి అధికారులు ప్రభుత్వ భూములను తప్పకుండా కాపాడుతామని, ఆక్రమణదారులు అందులోకి వెళ్లకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# అమెరికా దురాక్రమణను ఆపండి.

- సిపిఎం నాయకులు డిమాండ్.



**నేటి సాక్షి:** వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూరు గ్రామంలో నిరసన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి రామకృష్ణ మహిపాల్ రైతు ఉపాధ్యక్షులు మాట్లాడుతూ వెనిజులాలోని వివిధ ప్రదేశాలపై అమెరికా బాంబు దాడి చేయడం ద్వారా చేపట్టిన దురాక్రమణ చర్యను సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. వెనేజులా అధికార మార్పు తీసుకురావటానికి, మధురో ప్రభుత్వాన్ని అస్థిరపరచటానికి గత కొన్ని వారాలుగా అమెరికా వెనిజులా చుట్టూ తన సైనిక నావికా దళాలను సమీకరించింది. డిసెంబర్ 2025 మొదటి వారంలో ప్రకటించిన అమెరికా జాతీయ భద్రతా వ్యూహం 2025 యొక్క నిజస్వరూపం ఇప్పుడు బయటపడింది. పశ్చిమార్థగోళంలో అమెరికా దళాల కేంద్రీకరణ మొత్తం ప్రాంతాన్ని తన నియంత్రణలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యాన్ని ట్రంప్ ప్రకటించడం పొరుగుదేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటమే. 2017, 2018 లో కూడా ఇదే తరహాలో వ్యాఖ్యలు చేయటం మనం చూసాము. ముఖ్యంగా వెనెజులా, నికరాగువ, క్యూబాలకు వ్యతిరేకంగా ఈ రకంగా దాడులకు ప్రయత్నిస్తోంది.. అమెరికా దురాక్రమణను వెంటనే ముగించాలని, కరేబియన్ సముద్రం నుండి తన దళాలన్నింటినీ ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోంది. లాటిన్ అమెరికాను శాంతి ప్రాంతంగా ప్రకటించాలి. సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడానికి అనుమతించకూడదు. అమెరికా దురాక్రమణను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించాలి. వెనిజులాపై తన దురాక్రమణను వెంటనే ఆపడానికి అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడి పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోంది. భారత ప్రభుత్వం ఈ దాడులను ఖండిస్తూ వెంటనే ప్రకటన చెయ్యాలని కూడా సీఐటీయూ వికారాబాద్ జిల్లా కమిటీ ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్ విజయలక్ష్మి కవిత కవిత అనురాధ నిర్మల లక్ష్మిబాయి రవి శంకర్ రాజు రాములు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలను నడపడలి



**నేటి సాక్షి:** డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి టి..పరంధామ రెడ్డి తెలిపారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి ప్రాంగణంలో లారీ మరియు టాక్సీ డ్రైవర్లకు రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా టి..పరంధామ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగమని, రోడ్డు కండిషన్ మరియు ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకొని పరిమిత స్పీడ్ తో వాహనాలను నడపాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు డ్రైవింగ్‌లో ఏకాగ్రత అవసరమన్నారు. రహదారులపై వాహనాలను నిలుపవద్దని డ్రైవర్లను ఆయన కోరారు.ఈ సమావేశంలో చీరాల డి.ఎస్.పి మహమ్మద్ మొయిన్ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలలో మరణిస్తే ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ విషయం దృష్టిలో ఉంచుకొని వాహనాలను జాగ్రతతో నడపాలని డ్రైవర్లను సూచించారు. నిద్ర మత్తు కూడా ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డి.ఎం. అండ్ హెచ్.ఓ డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ డ్రైవర్లందరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే డ్రైవర్లు సురక్షతమైన డ్రైవింగ్ చెయ్యగలరని అన్నారు. డ్రైవర్లకు

- ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చును
- జిల్లా రవాణా శాఖ అధికారి టి..పరంధామ రెడ్డి


బీ.పి, షుగర్,ఐ చెక్‌అప్‌లను ఉచితంగా నిర్వహించడం తో పాటు, డ్రైవర్లకు ప్రథమ చికిత్స పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీరాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. రామ కృష్ణ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్_. రవి నాయక్ , లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. మురళి మోహన్, సెక్రటరీ వి.చంద్ర బాబు, చీరాల టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.మోజెస్ మరియు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# సఖిలకి ధ్రువీకరణ పత్రాల పంపిణి



**నేటి సాక్షి:** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా జిల్లాలోని 20 మండలాలకు సంబంధించిన కృషి సఖిలకు ధ్రువీకరణ పత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, అందజేశారు. శిక్షణ పొందిన కృషిసఖీలు తమ తమ మండలాలలోని ప్రకృతి వ్యవసాయ మహిళా రైతులకు సహాయపడవలసి ఉంటుందని చెప్పారు. వ్యవసాయంలో ముఖ్యపాత్ర వహించే మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంలో ప్రావీణ్యత పొందడంతో ఇబ్బంది లేకుండా ఈ పద్ధతిలో వ్యవసాయం చేయవచ్చునని అందువలన మహిళా రైతులకు ముందువరుషలో ఉంచి ఈ విధానంలో శిక్షణ ఇచ్చామని మండల వ్యవసాయ అధికారి ఎండి షాహిద్ అలీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, తెలిపారు. ఈ కార్యక్రమంలో జన వికాస ఎన్జీవో ఇతర ప్రకృతి వ్యవసాయ వక్తలు పాల్గొన్నారు.

# అలరించిన ముగ్గుల పోటీలు




**నేటి సాక్షి: తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో సోమవారం పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొని, పంచాయతీ కార్యాలయ ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం న్యాయ నిర్ణేతలు అందంగా వేసిన ముగ్గుల్లో మొదటి ఐదింటికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారమిత అలుగునూర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్, సర్పంచ్ గుజ్జుల శ్వేతా ప్రణీత్ రెడ్డి, ఉప సర్పంచ్ పొలం మల్లేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆరోపణలు చేస్తే సహించేది లేదు

### టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి



**నేటి సాక్షి: తిరుపతి:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పై నిరాధారమైన ఆరోపణ చేస్తే సహించుకోమని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు సోమ వారం రామచంద్రపురం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయన విలేకరులతో మాట్లాడుతూ 27- 7 -2024లో ఎమ్మెల్యే 21 లక్షలతో ఆరు ఆర్ ఓ ప్లాంట్లను మంజూరు చేయించి నిర్మాణాలు చేశారు అన్నారు 31 7 2024లో తుడా నిధులతో రాయల్ చెరువు కట్టపై చాపల మార్కెట్ బస్సులు మంజూరు చేయించి నిర్మించారు ఎక్కడలేని విధంగా సిసి రోడ్ల నిర్మాణం తారు రోడ్ల నిర్మాణం మహిళలకు రుణాలు రైతులకు సబ్సిడీ పనిముట్ల అందించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు చేకూరి జనార్దన్ చౌదరి టిడిపి నాయకులు కొట్టే నరసింహ రెడ్డి ,విజయ్ కుమార్ రెడ్డి, లీలా కృష్ణారెడ్డి మహేష్ రాయల్ ,జగదీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు

# నూతన అధ్యక్షుడిగా తెల్ల రవీందర్ ఎన్నిక



**నేటి సాక్షి: ( బుర్ర అంజయ్య గౌడ్):**గన్నేరువరం గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గంను ఎన్నికల అధికారి తెల్ల అంజయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెల్ల రవీందర్, గౌరవ అధ్యక్షులుగా తెల్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా మచ్చ బాలరాజు,ప్రధాన కార్యదర్శిగా సబ్బని మహేష్, కోశాధికారిగా ఓడ్నాల అంజయ్య, కార్యదర్శిగా వేముల రవి కుమార్, సంయుక్త కార్యదర్శిగా తెల్ల లక్ష్మణ్, ముఖ్య సలహాదారులుగా తెల్ల అంజయ్య, వెంగళ కమలాకర్ కార్యవర్గ సభ్యులుగా భీమనాతిని ధర్మయ్య, చిప్ప శోభన్, వేముల లక్ష్మపతి, బూర లక్ష్మణ్, వేముల రాములు, గాలి చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తెల్ల రవీందర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి సభ్యులను అందరి సహకారంతో ముందుకు వెళ్తామని తెలిపారు. పద్మశాల హక్కుల కొరకు ఐక్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బూర రామకృష్ణ, తెల్ల భాస్కర్, బూర వెంకటేశ్వర్లు, తెల్ల సుధాకర్, బలరాం, గాలి ఆంజనేయులు, వార్డు సభ్యులు మచ్చ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవోకు సన్మానం



**నేటి సాక్షి:** ఆయన సేవే ఆయనకు ఒక గుర్తింపు తీసుకొచ్చిందని టిడిపి సీనియర్ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. పలు పంచాయతీలలో సేవలందించి ప్రభుత్వం రెండు నెలల కిందట విడుదల చేసిన పదోన్నతి పొంది బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో గా పల్నాటి శ్రీరాములు పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బాపట్ల టిడిపి పార్టీ సీనియర్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు కూడా ఉన్నారు.

# ప్రతి కుటుంబానికి పని కల్పిస్తాం

### ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు



**నేటి సాక్షి :** జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంకు 125 రోజులు పని కల్పించడంతో పాటు పని దినంకు 307 రూపాయిలు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ అద్దురి శ్రీనివాసరావు అన్నారు.కర్లపాలెం పంచాయతీలో గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వికసిత భారత్ జి రామ్ జి పథకం వల్ల ఉపాధి హామీ పథకం కార్డుదారులకు 25శాతం ఆదాయం పెరుగుతుందన్నారు. పని చేసిన వెంటనే చెల్లింపులు జరుగుతాయని, ఆలస్యం అయితే పరిహారం ఇవ్వడం కూడా జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ,పంచాయతీ ఇంచార్జి పద్మావతి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, వార్డు మెంబర్లు పయనం శ్రీనివాసరెడ్డి,పిట్టు సుబ్బారెడ్డి, ముదునూరి సావిత్రి,బుర్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ



- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ
- అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ

**నేటి సాక్షి :** కొమరం భీం ఆసిఫాబాద్: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ గారు ఈరోజు రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ ఎస్‌హెచ్‌ఓ వెంకటకృష్ణతో పాటు స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో భాగంగా రాత్రిపూట పైటింగ్, ప్యాట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఎలాంటి సడలింపులు లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ సంజయ్ పాల్గొన్నారు. జిల్లా పోలీసు శాఖ, కుంరం భీమ్ ఆసిఫాబాద్

# పద్మశాలిలు రాజకీయంగా ఎదగాలి

- స్థానిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు ఆత్మీయ సన్మానం

కాసారపు భవాని అరవింద్ గౌడ్



**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్ ):** రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన సామాజిక వర్గాల్లో ఒకటైన పద్మశాలిలు రాజకీయంగా ఎదిగి తమ సత్తా చాటాలని పెగడపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశం పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులకు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సంధర్భంగా గంగ మల్లేశం మాట్లాడుతూ పద్మశాలిలు అంటే ఓర్పు,సహనం ఎక్కువ కలవారని సౌమ్యులు అని పేరు ఉన్నారని అంతేకాకుండా సమయం వచ్చినపుడు పులిలా గర్జించే శక్తి కలవారని అనేక రకాల వ్యాపార రంగాల్లో పద్మశాలిలు ఉన్నత స్థానంలో ఉన్నారని అదే విధంగా పద్మశాలిలు ఐక్యంగా ఉండి రాజకీయాల్లో కూడా రాణించాలని రాబోయే ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల వ్యాప్తంగా గెలుపొందిన సర్పంచ్,ముగ్గురు ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి కురిక్యాల శంకరయ్య,కార్యవర్గ సభ్యులు మహేషుని శంకరయ్య,మండల కార్యవర్గ సభ్యులు అందే వెంకటేశం,గాలిపెల్లి సత్తయ్య, భోగ గోపి, భోగ గంగాధర్,చేనేత ఐక్య వేదిక మండల అధ్యక్షుడు ఎలగొండ వెంకట రమణ,జిల్లా కార్యవర్గ సభ్యులు మహేశని శంకరయ్య.యువజన విభాగం అధ్యక్షుడు సాంబారు లక్ష్మ నారాయణ,రిటైర్డ్ ఉపాధ్యాయుడు గాజుల నర్సయ్య,వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు,కుల బంధువులు పాల్గొన్నారు.

# మరకత శివాలయంలో భక్తుల రద్దీ



**నేటి సాక్షి** శంకర్‌పల్లి: జనవరి 03: ( నేటి సాక్ష): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఉదయం నుంచి అభిషేకాలను రద్దుచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కోరిన కోరికలు తీర్చే రాయి వద్ద భక్తులు బారులు తీరారు. టాలీవుడ్ హనుమాన్ సినీ నిర్మాత స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు నిర్మాతను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. భక్తులకు అన్నదాతలు మోకిల తండా రవి నాయక్, జీడిమెట్ల విశ్వనాథ్ రెడ్డి, హైదరాబాద్ హరినాథ్ రాజు, సింగాపురం విట్టలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, కార్యదర్శి జనార్ధన్, అన్న ప్రసాద చైర్మన్ దర్శన్ గౌడ్, అర్చకులు శివసాయి ప్రసాద్, ప్రమోద్, వీరేష్ ఉన్నారు.

# ఉచిత పథకాలు వద్దు పిల్లల భవిష్యత్తు ముద్దు

- బీసీ ఎస్సీ సంక్షమ హాస్టళ్ల లో సమస్యల తీష్ట యువ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి



నేటి సాక్షి : జోగులాంబ గద్వాల జిల్లాదొడ్డి మండలం బిఆర్ఎస్ నాయకుడు గాజుల కృష్ణ మాట్లాడుతూ విద్యాపరంగా ఆర్థిక ఇబ్బందులు కలిగిన నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే సంక్షమ వసతి గ్రహాల ప్రధాన ఉద్దేశం కానీ నేడు వసతి గ్రహాలు నరక కూపాలుగా మారిపోయాయి. పర్యవేక్షంచే అధికారులు లేకపోవడంతో విద్యార్థులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి సమస్యలను పరిష్కరించాలంటూ మొత్తుకున్న పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. బీసీ ఎస్సీ సంక్షమ వసతి గ్రహాలు అంటే ఒకప్పుడు సొంత ఇంటితో సమానంగా భావించేవారు విద్యార్థులు. కానీ నేడు అవే ఇప్పుడు వారికి నరక కూపాలుగా దర్శనమిస్తున్నాయి..జిల్లాలో కొన్ని హాస్టళ్ల లో కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు బస్తాలు అడ్డుపెట్టుకుంటున్నారు.. కొన్ని హాస్టళ్ల లో మరుగుదొడ్లు సరిగా లేవు. జిల్లా లో కొన్ని హాస్టళ్ల వసతి గ్రహాలు పెచ్చులు ఊడిపోతున్నాయి కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి.. మరికొన్ని వసతి గ్రహాలలో పిల్లలు త్రాగడానికి నీళ్ల కోసం ఇబ్బంది పడే పరిస్థితి ఉంది .ఇప్పటికైనా జిల్లాలో ఉండేటటువంటి అధికారులు బీసీ ఎస్సీ హాస్టళ్ల పై దృష్టి పెట్టి వారికి సరైన సౌకర్యం కల్పించాలని జిల్లా ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుకుంటున్నారు

# ఆహారం పట్ల జాగ్రత్తలు వహించాలి



**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామ సర్పంచ్ శోభన్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్‌ని ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేసి వారి యోగక్షమాలు అడిగి తెలుసుకున్నారు వారి ఆహారం పట్ల జాగ్రత్తలు, వహించాలని పాఠశాల సిబ్బందిని కోరడం జరిగింది. అలాగే పలు అంగన్వాడి కేంద్రాలను కూడా పరిశీలించడం జరిగింది. పరిశీలన అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం అన్నప్రాసం పోషక ఆహారం పై పలు సూచనలు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంఈఓ టీచర్‌లు ఉపసర్పంచ్ గడ్డం కవిత రాజేందర్ రెడ్డి గ్రామ ప్రజాప్రతినిధులు సెక్రటరీ పాల్గొనడం జరిగింది.

# క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా అధ్యక్షులు బి.చంద్రయ్య,కార్యదర్శి వేణు వీరన్న ఖాన్ రాజేష్ గంగరాజు రాజవ్వ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు



# అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన

కాసారపు భవాని అరవింద్ గౌడ్



**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలోనీ అంగన్వాడి కేంద్రం 2 లో సోమవారం రోజున అన్నప్రాసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆరోగ్య సూత్రాల మీద ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, వాటి ప్రాధాన్యత బలమైన ఆహార పోషకాల విలువలపై తెలుపుతూ వైద్యుల సూచన మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్, ఉప సర్పంచ్ సిరవేణి రవి, వార్డు నెంబర్లు బుర్ర తిరుపతి,కోమల్ల హనుమంతు ఎంగ్రికాయల గంగాధర్, కాళ్ళ జమున చంద్రశేఖర్ శ్రీ పతుల లత శంకరయ్య అంగన్వాడి టీచర్లు.రమాదేవి వి.రమాదేవి ఏఎన్ఎం ఆశావర్కర్లు తల్లులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రజావాణికి 85 ఫిర్యాదులు స్వీకారణ.



**నేటి సాక్షి వికారాబాద్:** ప్రజావాణి కార్యక్రమములో వచ్చిన ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 85 ఫిర్యాదులు వచ్చాయని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుదీర్, ట్రైని కలెక్టర్ హర్స్ చౌదరి, ఆర్ డిఓ మంగీ లాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర,డి ఆర్‌డిఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను సంబంధిత అధికారులు దరఖాస్తు లను పెండింగ్‌లో ఉంచకుండా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పైప్ లైన్ కు మరమ్మతులు...



**నేటి సాక్షి (కోక్కుల వంశీ):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని లీకేజ్ పైప్ లైన్స్ లను సోమవారం గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్ పంచాయతీ పారిశుద్ధ కార్మికులతో ముమ్మరంగా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలోని త్రాగునీటి సమస్య లేకుండా చూడడమే గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడైనా త్రాగు నీటి సమస్య వున్న గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు..

## ఇందిరమ్మ చీరాల పంపిణీ



**నేటి సాక్షి (గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామం లో సోమవారం రోజున గ్రామ పంచాయతీ కార్యాలయం లో గ్రామ సర్పంచ్ బాల గౌడ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అక్క చెల్లెళ్ళకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుక ఇందిరమ్మ చీరాల రెండో విడతలో భాగంగా స్వయం సహాయక మహిళా సభ్యులందరికి పంపిణీ చేయడం జరిగింది

## ఉప సర్పంచ్ కు ఘన సన్మానం.



**నేటి సాక్షి ప్రతినిధి,( కోక్కుల వంశీ ):** రుద్రంగి మండలం మానాల గ్రామంలోని పెద్దమ్మ ఆలయం ఆవరణలో సోమవారం ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షడు నాంచారి రాకేష్, ఉప అధ్యక్షడు ఇండ్ల అజయ్ తో పాటు యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల ఉపసర్పంచిగా ఎన్నికైన దాసరి అశోక్ ను ముదిరాజ్ యూత్ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దాసరి అశోక్ మాట్లాడుతూ... మీరు చేసే మంచి పనుల్లో అండగా ఉంటానని గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కావాలని మీ వంతు కృషి చేయాలని యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ అధ్యక్షులు నాంచారి రాకేష్, ఉప అధ్యక్షులు ఇండ్ల అజయ్, యూత్ సభ్యులు పీసరి రవీంధర్, మాడవేని రాజు, గుర్రపు చందు,నీలం గణేష్, దాసరి శ్రీనివాస్, దాసరి శేఖర్ ,పీసరి చరణ్, పండుగ గణేష్,నీలం స్వామి, రాగుల నవీన్, జలగడుగుల గంగాధర్,పండుగ ప్రవీణ్, దాసరి గణేష్, నాంచారి సిద్దు, సిరికొండ నితిన్, సిరికొండ కార్తీక్ యూత్ సభ్యులు పాల్గొన్నారు

## గుర్తుతెలియని వాహనం ఢీ

**ఆరు మేకలు మృతి**



**నేటి సాక్షి నల్లబెల్లి:** గుర్తుతెలియని వాహనం ఢీకొని మేకలు మృతి చెందిన సంఘటన బిల్లా నాయక్ తండా శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నల్లబెల్లి మండలం బిల్ నాయక్ తండ గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆరు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. స్థానికుల కథనం మేరకు బిల్లా నాయక్ తండాకు చెందిన మాలోత్ శర్మ అడవిలో మేకలను మేపుకొని తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రాత్రి వేళలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం మేకలను ఢీకొట్టడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. సంఘటనపై డయల్ 100కు ఫోన్ చేయగా నల్లబెల్లి ఎస్ఐ గోవర్ధన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**నేటి సాక్షి రుద్రంగి:** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల దుబాయ్ సంక్షమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బదనవేని చిన్నారెడ్డి, కోశాధికారిగా జక్కుల శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బదనవేని చిన్నారెడ్డి మాట్లాడుతూ.. మానాల దుబాయ్ సంక్షమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని కోరారు. తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పేరు పేరునా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానాల దుబాయ్ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

# సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి..

- **సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు**



**నేటి సాక్షి:** అన్ని శాఖలలో పనిచేసే అధికారులు ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ఉదయం 10 గంటలకు రావలసిన అధికారులు 12 గంటలైన ఆఫీసులో కుర్చీలు ఖాళీలుగా ఉన్నాయని పీజీఆర్ఎస్ లో కూడా అధికారులు దుమ్మా కొడుతున్నారని ఈ విషయంపై విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం తాసిల్దార్ చంద్రశేఖర్ నాయకులు అధికారుల సమయపాలన పాటించడం లేదని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరుతున్న కార్యాలయాలకు సమయపాలనతో పాటించాలని చెబుతున్న కూడా అధికారులు మాత్రం స్పందించడంలో విఫలం చెందరన్నారు.. చాలా శాఖల్లో అధికారులు 12 గంటలైనా హాజరు కావడంలేదని కార్యాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయని,,ఈ విధానం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులు,టీచర్లు సమయపాలన పాటించడం లేదన్నారు.. నేషనల్ సీడ్ ఫారం, కేస్సి నాల్ అధికారులతో పాటు చాలా డిపార్ట్మెంట్లో హాజరు కావడంలేదని కావున ఈ విషయంపై విచారణ చేయాలని ఎవరైనా సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.. నిర్లక్ష్యం చేస్తే అధికారి కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మక్బూల్ బాషా,మండల నాయకులు రాజు,పుల్లయ్య, దేవరాజు,సలీమ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు..ఎపిఆర్ఎస్ఎ జిల్లా ఉపాధ్యక్షులు గా సత్య దీప్ .. ఎన్నిక కావడం అభినందనీయంలి... ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా జూపాడుబంగ్లా మండల డిప్యూటీ తాహసిల్దార్ సత్యదీప్ గారు ఎన్నిక కావడం అభినందించదగ్గ విషయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తాహసిల్దార్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు..

# తప్పుల తడక మున్సిపాల్టీ ఓటరు జాబితా




**నేటి సాక్షి:** సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొని, శంకర్‌పల్లి మున్సిపాలిటీ జనవరి ఒకటవ తేదీన విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో మృతి చెందిన వ్యక్తుల పేర్లు, ఒకే వ్యక్తికి రెండుసార్లు నమోదు అయిన పేర్లు, అలాగే మున్సిపాలిటీ పరిధిలో నివసించని వారి పేర్లు ఉన్నాయని, ఇవి ఎన్నికల న్యాయసమ్మతతపై సందేహాలు కలిగిస్తున్నాయని, వెంటనే తగు చర్యలు తీసుకుని ఓటరు జాబితా సవరించి, పారదర్శకమైన జాబితాను సిద్ధం చేయాలని కోరారు. స్థానికంగా పలుమార్లు తనిఖీ చేసినప్పటికీ ఈ తప్పులు ఇంకా సరి చేయలేదని మృతుల ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, బయటి వారి ఓట్లు దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉండి, నిజమైన ఓటర్ల హక్కులకు నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. కేవలం 7 వ వార్డు పరిధిలోనే సుమారు 150 అనధికార ఓట్లు ఉన్నాయని, మొత్తం మున్సిపల్ వార్డుల్లో ఇలాంటి ఓట్లు గణనీయంగా ఉన్నాయని వాటి వల్ల ప్రజాస్వామ్య ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకుని సత్వరమే సమస్య పరిష్కారించకపోతే న్యాయపోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# భూములను సర్వే చేయండి

**నేటి సాక్షి : తిమ్మాపూర్:** మన్నెంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూములను సర్వే చేసి, వాటిని సంరక్షంచాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పొన్నం సునీత అనిల్ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని కోరారు. సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఎమ్మార్వోను కలిసి పుష్పగుచ్చం అందజేసినట్లు సునిత అనిల్ గౌడ్ తెలిపారు. గ్రామంలో సర్వే నెంబర్ 6లో అన్యాకాంత్రమవుతున్న స్థలాన్ని పరిరక్షంచాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన ఎమ్మార్వో త్వరలోనే సర్వే చేయిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.



# డైనమిక్ లీడర్ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు





- **డాక్టర్ ఘనంగా నిర్వహించిన ప్రభుత్వ టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ కురువ రమేష్.**

**నేటి సాక్షి :** మండల కేంద్రమైన పాములపాడులో ప్రభుత్వ టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్ నందికొట్కూరు నియోజవర్గ యువ నాయకుడు కురువ. రమేష్ ఆధ్వర్యంలో డైనమిక్ లీడర్ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పుట్టినరోజు వేడుకలను నాయకులు, కార్యకర్తల మధ్యన ఘనంగా నిర్వహించడం జరిగింది. పాములపాడులో బైరెడ్డి అభిమానులు, కూటమి నాయకుల, కార్యకర్తల సమక్షంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పుట్టినరోజు సందర్భంగా టిడిపి యువ నాయకుడు కురువ. రమేష్ ఆధ్వర్యంలో భారీ కేక్ ను కటింగ్ చేసి ఒకరికి, ఒకరు తినిపించుకొని సంతోషంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. డాక్టర్ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలలో చిన్నారులు కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. అనంతరం ప్రభుత్వ టెలికాం అడ్వైజరి కమిటీ మెంబర్ కురువ. రమేష్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి కరివేన ఎస్. ఆర్.బీ.సీ. కాలనీలోని, మానవతా నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధు లకు, అనాధలకు ఈ చలికాలంలో కప్పుకోవడానికి బెడ్ షీట్లు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు కే.రమేష్ మాట్లాడుతూ మన రాయలసీమ పులి నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వారసురాలు, తండ్రిలోని మంచితనాన్ని పునికిపుచ్చుకొని కష్టాల్లో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు నేనున్నానని భరోసా కల్పిస్తూ అన్ని రకాలుగా సహాయం అందిస్తున్న నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో చేసుకోవాలని కోరుకుంటూ, గొప్ప గొప్ప పదవులు చేపట్టి, ప్రజలకు మంచి సేవ చేయాలని ఆ దేవున్ని ప్రార్థిస్తూ ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గాండ్ల సురేష్, కురువ వెంకటేశ్వర్లు, సునీల్,ఈశ్వర్, రంజిత్, కురువ.నాగరాజు, చింటూ, శివ, టైలర్ వెంకటస్వామి, మధు, అలిభాష, లింగాల మల్లికార్జున, సుభాన్, శ్రీనివాసులు, చిన్న, భరత్, నాగరాజు, శాంతరాజు, మానవతా నిలయం వృద్ధాశ్రమం నిర్వాహకులు యుగంధర్, వృద్ధులు, తదితరులు పాల్గొనడం జరిగింది.